ప్రభాత
# ఉదయం
తెలుగు దినపత్రిక

**రిపోర్టర్లు కావలెను**

అత్యంత ప్రజాదరణ పొందిన ప్రభాత ఉదయం
తెలుగు దినపత్రికలో పనిచేయుటకు తెలంగాణ వ్యాప్తంగా
జిల్లా, మండల మరియు నియోజకవర్గాల వారీగా
రిపోర్టర్లు కావలెను.

ఉదయం
సంప్రదించండి
ఫోన్: 93910 89608

సంపుటి: 4 | సంచిక: 130 | పేజీలు: 6 | వెల: రూ.3/- | బుధవారం 19 ఆగస్టు 2026 | ఎడిటర్: ఎం.దామోదర్ రెడ్డి

22శాతం ఓట్ల తొలగింపు

## దుర్మార్గపు చర్య

**ఇష్టం వచ్చినట్లుగా ఓటు హక్కు తొలగించడం అన్యాయం**

**తెలంగాణలో సర్ ప్రక్రియను పొడిగించాలి**

**పిసిసి చీఫ్ మహేశ్ గౌడ్ డిమాండ్**




**హైదరాబాద్, ఆగస్టు 18 (ప్రభాత ఉదయం)**

2014లో కొలువుదీరిన నాటి నుంచి రాజ్యాంగ సంస్థలను నిర్వీర్యం చేస్తుందంటూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వంపై తెలంగాణ పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ మండిపడ్డారు. ఎన్నికల కమిషన్ కూడా బీజేపీకి అనుబంధ సంస్థగా మారిందని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం సీబీఐ, ఈడీ తరహాలో ఎన్నికల సంఘాన్ని కూడా తనకు అనుకూలంగా మార్చుకుందని ఆయన తీవ్ర ఆరోపణలు చేశారు.తెలంగాణలో ఎస్ఐఆర్‌కు ఇంకా సమయం ఇవ్వాలని ఈసీని డిమాండ్ చేశారు. అర్హులైన అందరికీ ఓటు హక్కు కల్పించాలని ఈసీని తెలంగాణ పీసీసీ చీఫ్ డిమాండ్ చేశారు.ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ పేరుతో తెలంగాణలో ఎన్నికల సంఘం నిర్లాక్షిణ్యంగా ఓట్లను తొలగించిందని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ ఆరోపించారు. ఓటర్ల ముసాయిదా జాబితాను రాష్ట్ర ఎన్నికల సంఘం విడుదల చేసిన నేపథ్యంలో ..మిగతా 2లో

సర్దార్ సర్వాయి పాపాన్న గౌడ్

# గొప్ప యోధుడు

**ట్యాంక్‌బండ్‌పై విగ్రహావిష్కరణ.. విగ్రహావిష్కరణ సభలో సిఎం రేవంత్ రెడ్డి**

**బిఆర్ఎస్‌లా సొంతవాళ్లకు పదవులు ఇవ్వలేదు**

**ఉద్యమకారులను గుర్తించి ఆదుకుంటున్నాం**

**ఆత్మగౌరవం, సామాజిక న్యాయం కోసం పోరాటం**



**హైదరాబాద్, ఆగస్టు 18 (ప్రభాత ఉదయం)**

సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ పోరాటం అద్భుతం అని తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి అభివర్ణించారు. అమరవీరుల స్తూపానికి ఉన్న ప్రాధాన్యతే పాపన్న విగ్రహానికి ఉండాలని స్పష్టం చేశారు. మంగళవారం హైదరాబాద్‌లో సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 376వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. హైదరాబాద్ ట్యాంక్‌బండ్‌పై ఆయన విగ్రహాన్ని మంగళవారం ముఖ్య మంత్రి రేవంత్‌రెడ్డి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్, పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, బీసీ సంఘాల నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ.. సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ ..మిగతా 2లో

టిఆర్ఎస్ అధికారంలోకి వస్తే

## 'భూ లక్ష్మి పథకం'




**భూమిలేని పేదలకు ఎకరం చొప్పున భూమి**

**రేవంత్ మాటల్లో సామాజిక న్యాయం చేతుల్లో ఆటవిక పాలన**

**పేదలకు భూమి పంపిణీ అత్యావశ్యకం**

**టిఆర్ఎస్ అధ్యక్షురాలు కవిత**

**హైదరాబాద్, ఆగస్టు 18 (ప్రభాత ఉదయం)**

తాము అధికారంలోకి వస్తే 'భూలకి' పేరుతో పేదలకు భూమి పంపిణీ చేస్తామని తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ప్రకటించారు. పేదల ..మిగతా 2లో



హైదరాబాద్ మెట్రో ఫేజ్-2

## అనుమతులకు కసరత్తు

**ప్రక్రియను వేగం చేసే పనిలో అధికారులు**

**హైదరాబాద్, ఆగస్టు 18 (ప్రభాత ఉదయం)**

హైదరాబాద్ మెట్రో ఫేజ్-2కు సంబంధించిన అనుమతుల ప్రక్రియను వేగవంతం చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ నేపథ్యంలోనే మెట్రో ప్రాజెక్టుకు అవసరమైన ఎన్‌సీఓలను త్వరగా జారీ చేయాలని పురపాలక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్ సంబంధిత అధికారులను కోరారు. ఈ మేరకు సచివాలయంలో కేంద్ర, రాష్ట్ర శాఖల అధికారులతో జయేష్ రంజన్ సమన్వయ సమావేశం నిర్వహించారు. జయేష్ రంజన్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో హెచ్ఎమ్ఆర్ఎల్ ఎండీ, హెచ్ఎండీఏ మెట్రోపాలిటన్ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్ ..మిగతా 2లో




## దిమాగీ నక్సల్స్.. మరో పార్టీ పుట్టుక

**ప్రధాని నోట మాటరావడం ఆలస్యం..**

**సోషల్ మీడియాలో ఉత్పన్నం**

**న్యూఢిల్లీ, ఆగస్టు 18 (ప్రభాత ఉదయం)**

కాక్రోచెస్ అంటూ సుప్రీం చీఫ్ జస్టిస్ చేసిన వ్యాఖ్యల ఆధారంగా కాక్రోచ్ జనతాపార్టీ పుట్టుకు వచ్చింది. ఇటీవల ఢిల్లీ జంతర్‌మంతర్ వద్ద తన సత్తా చాటింది. ఇప్పుడు ఇలాంటిదే మరో పార్టీ పుట్టుకు వచ్చింది. సాయుధ నక్సల్స్‌ను నిర్మూలించామని.. దిమాగీ నక్సల్స్ మాత్రం మిగిలారంటూ ఎర్రకోట వేదికగా ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రకటించారు. ఈ వ్యాఖ్యల ఆధారంగా కొత్తపార్టీ పుట్టుకువచ్చింది. మోదీ ఆ వ్యాఖ్యలు ..మిగతా 2లో

# క్రిమినల్ కేసుల్లో రేవంత్ టాప్




**పెండింగ్‌లో 89 కేసులు**

**చంద్రబాబుపై 19 కేసులు**

**సుప్రీంకోర్టుకు పిల్ నివేదిక**

**న్యూఢిల్లీ, ఆగస్టు 18 (ప్రభాత ఉదయం)**

దేశవ్యాప్తంగా సిట్టింగ్ ఎంపీలు, ఎమ్మెల్యేలపై ఏకంగా 4,192 క్రిమినల్ కేసులు పెండింగ్‌లో ఉన్నట్లు సుప్రీంకోర్టుకు తాజాగా అందిన ఒక నివేదిక సంచలనం సృష్టించింది. చట్టసభల్లో కూర్చుని చట్టాలను చేయాల్సిన నాయకులే నేరారోపణలు ఎదుర్కోవడం మన దేశ రాజకీయాల్లో మరోసారి చర్చాంశంగా మారింది. దేశంలో ప్రజాప్రతినిధులపై ఉన్న క్రిమినల్ కేసులను త్వరగా పరిష్కరించాలని కోరుతూ దాఖలైన పిల్ విచారణలో భాగంగా, కోర్టు నియమించిన అమికస్ క్యూరీ సీనియర్ అడ్వకేట్ విజయ్ హన్సారియా ఈ రిపోర్టును సమర్పించారు. బీజేపీ నాయకుడు, లాయర్ అశ్వినీ కుమార్ ఉపాధ్యాయ వేసిన ఈ పిటిషన్ రాజకీయ వర్గాల్లో ఇప్పటికే తీవ్ర కలకలం రేపింది. లోక్‌సభలోని 543 మంది సభ్యుల్లో ..మిగతా 2లో

నేను కూడా దిమాగీ

## నక్సలైట్‌నే

**ప్రధాని మోడీ వ్యాఖ్యలపై కేజ్రీవాల్ కామెంట్**



# టీఆర్ఎస్ అధికారంలోకి వస్తే 'భూ లక్ష్మి పథకం'

**మొదటి పేజీ తరువాయి...**

భూములను రేవంత్‌రెడ్డి లాక్కుంటే.. చూస్తు ఊరుకోమని హెచ్చరించారు. మంగళవారం హైదరాబాద్‌లోని బంజారా హిల్స్.. టీఆర్ఎస్ కార్యాలయంలో కవిత మీడియాతో మాట్లాడారు. బీసీలకు పెద్దపీట వేస్తామని చెప్పినా.. ఆచరణలో మాత్రం సామాజిక న్యాయం ఎందుకు కనిపించడం లేదని ప్రశ్నించారు. తెలంగాణ రక్షణ సేన అధికారంలోకి వస్తే రాష్ట్రంలోని భూమిలేని పేదలకు ఎకరం చొప్పున భూమి ఇచ్చేలా 'భూ లక్ష్మి పథకం' అమలు చేస్తామని ఆ పార్టీ అధినేత్రి కవిత ప్రకటించారు. రాష్ట్రంలో భూమి పంపిణీ అవసరం ఉందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి భూమి కేవలం లావాదేవీల అంశంగా కనిపించవచ్చని, అయితే పేద బీసీ, ఎస్సీ, ఎస్టీ మహిళలకు భూమి, అడవి జీవనాధారమని కవిత వ్యాఖ్యానించారు. రాష్ట్రంలో ఏ ప్రాజెక్టు చేపట్టినా ముందుగా అసైన్డ్ భూములనే తీసుకుంటున్నారని ఆరోపించారు. రాష్ట్రంలో సుమారు 30 వేల ఎకరాల అసైన్డ్ భూములను ప్రభుత్వం తీసుకుందని కవిత ఆరోపించారు. ముఖ్యమంత్రికి చిత్తశుద్ధి ఉంటే ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు పేదలకు అసైన్డ్ భూములపై యాజమాన్య హక్కులు కల్పించాలని డిమాండ్ చేశారు. రేవంత్‌రెడ్డి సోదరులపై కూడా కవిత తీవ్ర ఆరోపణలు చేశారు. వారి ఆధ్వర్యంలో భూ దోపిడీ జరుగుతోందని ఆరోపిస్తూ రాష్ట్రంలో రేవంత్‌రెడ్డి పాలనను తీవ్రంగా విమర్శించారు. రేవంత్‌రెడ్డి, భట్టి విక్రమార్క కుటుంబ సభ్యుల ప్రభావం ప్రభుత్వంలో కొనసాగుతోందని ఆమె ఆరోపించారు. సామాజిక న్యాయం గురించి మాట్లాడుతున్న రేవంత్‌రెడ్డి.. గత 31 నెలల్లో ఆ అంశాన్ని ఎందుకు పట్టించుకోలేదని కవిత ప్రశ్నించారు. సామాజిక న్యాయం గురించి మాట్లాడే ముందు కేబినెట్‌లో ఎస్సీ, ఎస్టీ, బీసీలకు తగిన ప్రాతినిధ్యం కల్పించాలని అన్నారు. ప్రభుత్వ సలహాదారుల నియామకాల్లోనూ బడుగు, బలహీన వర్గాలకు అన్యాయం జరుగుతోందని ఆరోపించారు. ఒకే రోజు శివధర్‌రెడ్డి, వీహెచ్‌లను సలహాదారులుగా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చిందని, అయితే ఇద్దరి వేతనాల్లో తేడా ఎందుకు ఉందని ప్రశ్నించారు. ఆర్టీఐ కమిషన్‌లో ఒక్క బీసీకి కూడా అవకాశం కల్పించలేదని కవిత ఆరోపించారు. ప్రభుత్వ నియామకాల్లో సామాజిక న్యాయం పాటించడం లేదని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీలో అగ్రవర్ణాలకు ఒక న్యాయం, పేదలకు మరో న్యాయం కొనసాగుతోందని ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వ విధానాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కవిత సూచించారు.విజయశాంతి లాంటి ఉద్యమకారులను పక్కన పెట్టి మంత్రి పదవి ఇవ్వకుండా ఎమ్మెల్సీ పదవితో సరిపెట్టారని విమర్శించారు. రేవంత్‌రెడ్డి చెప్పేది సామాజిక న్యాయం.. కానీ ఆచరణలో మాత్రం అటవికా న్యాయమని విమర్శించారు. అప్పర్ క్లాస్ మాట్లాడితే ఒక రకమైన చర్యలు. లో క్లాస్ మాట్లాడితే మరో రకమైన చర్యలు తీసుకుంటారా ఇదేనా రేవంత్‌రెడ్డి సామాజిక న్యాయం అని ప్రశ్నల వర్షం కురిపించారు. తెలంగాణలో రేవంత్ రాక్షస పాలన సాగుతోందని విమర్శించారు.



### 22శాతం ఓట్ల తొలగింపు

# దుర్మార్గపు చర్య

గాంధీభవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. తాము ప్రతి ఓటు హక్కు కాపాడాలని చూస్తున్నామని అన్నారు. ఎన్నికల సంఘం గైడ్‌లైన్స్‌తో చాలా నష్టం జరుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈసీ ఉదాసీనంగా చూడటం కరెక్ట కాదని అభిప్రాయపడ్డారు. తెలంగాణ 3.38 కోట్ల ఓట్లు ఉన్నాయని గుర్తు చేశారు. ఎఎస్‌బీడీల పేరుతో 22 శాతం ఓట్లు తొలగించారని చెప్పారు. ఓట్ల తొలగింపునకు ప్రధాని మోదీతోపాటు కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా బాధ్యత వహించాలని అన్నారు. పేద ప్రజల ఓట్లు తొలగిపోతున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ బీఎల్ఏలను 35 వేల మందిని నియమించిందని తెలిపారు. కానీ ఈసీ మాత్రం13,100 మందిని ఇచ్చినట్లు చూపిస్తుందని చెప్పారు. సామాన్యుడి ఓటు తొలగించే ప్రయత్నం చేస్తున్నారంటూ ఈ సందర్భంగా ఈసీపై నిపలు చెరిగారు. 2002లో ఓటు వేసి ఉండాలని కండిషన్‌తో చాలా మంది ఎనుమరేషన్ పామ్స్ ఇవ్వలేక పోయారని చెపకొచ్చారు. దీంతో వారిని కూడా ఓటర్ల జాబితా నుంచి తొలగిస్తున్నారని వివరించారు. అన్ మ్యాపుడ్ ఓట్లు 32,37000 ఉన్నాయని అన్నారు. అలాగే 60,50ఓట్లు సందేహంగా ఉన్నాయని చూపిస్తున్నారని పేర్కొన్నారు. దాంతో 92 లక్షల ఓట్లు ప్రశ్నార్ధకంగా మారాయని ఆవేదనతో అన్నారు. 1.60 కోట్ల ఓట్లు ఎందుకు క్వచ్చన్ మార్క్ పెట్టారో చెప్పాలంటూ ఈసీని తెలంగాణ పీసీసీ చీఫ్ డిమాండ్ చేశారు. దేశంలో ఓటు హక్కును తొలగించే అధికారం మీకు ఎవరు ఇచ్చారంటూ ఈసీని ఆయన సూటిగా ప్రశ్నించారు. ప్రతి పౌరుడి ఓటు కాపాడాలని కాంగ్రెస్ పార్టీ ప్రయత్నం చేస్తోందని అన్నారు. హైదరాబాద్ నగరంలో బూత్ స్థాయి అధికారులు (బీఎల్‌వోలు) అనేక ప్రాంతాల్లో ఓటర్ల ఇళ్లకు వెళ్లలేదని మహేశ్‌కుమార్ గౌడ్ ఆరోపించారు. ముఖ్యంగా పేదలు, వలస కూలీల ఓట్లే పెద్ద సంఖ్యలో తొలగించారని విమర్శించారు. 2002 నాటి ఓటర్ల జాబితా ఎంతమందికి అందుబాటులో ఉందని ప్రశ్నించారు. రాష్ట్రంలో ఎలాంటి కారణం లేకుండా 73 లక్షల ఓట్లను ఎన్నికల సంఘం తొలగించిందని మహేశ్‌కుమార్ గౌడ్ ఆరోపించారు. మొత్తంగా 92 లక్షల ఓట్లను ప్రశ్నార్థకం చేశారని పేర్కొన్నారు. డీలిమిటేషన్, పోలింగ్ కేంద్రాల మార్పు కారణంగా 2002 నాటి ఓటర్ల వివరాలతో ప్రస్తుత జాబితాను సరిపోల్చడంలో అనేక ఇబ్బందులు ఉన్నాయన్నారు. 2002 నాటి ఓటర్ల జాబితాతో ముడి పెట్టకుండా అర్హులైన ప్రతి పౌరుడికి ఓటు హక్కు కల్పించాలనిమహేశ్ కుమార్ గౌడ్ డిమాండ్ చేశారు. లక్షలాది మంది ఓట్లను తొలగించి ప్రజాస్వామ్య దేశంగా ఎలా చెపకుంటామని మహేశ్‌కుమార్ గౌడ్ ప్రశ్నించారు. ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో జరిగిన తొలగింపులపై సమగ్రంగా పరిశీలించి అర్హులైన ఓటర్లకు తిరిగి ఓటు హక్కు కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు.

### సర్దార్ సర్వాయి పాపాన్న గౌడ్

# గొప్ప యోధుడు

**మొదటి పేజీ తరువాయి...**

ఆత్మగౌరవం, సామాజిక న్యాయం కోసం పోరాడిన గొప్ప యోధుడని కొనియాడారు. అమరవీరుల స్థూపానికి ఎంత ప్రాధాన్యం ఉంటుందో పాపన్న విగ్రహానికి కూడా అంతే ప్రాధాన్యం ఉండాలని అన్నారు. బీసీ నేతల విజ్ఞప్తి మేరకు నెక్లెస్ రోడ్డుపై పాపన్న విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. చరిత్రను చెప్పుకోవడంలో మనం వెనుకబడ్డామని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై బీఆర్ఎస్ దుష్ప్రచారం చేస్తోందని మండిపడ్డారు. అక్రమ సంపాదనతో సోషల్ మీడియాలో దుష్ప్రచారం చేస్తున్నారంటూ బీఆర్ఎస్ పార్టీపై విరుచుకుపడ్డారు. 2029లో అధికారంలోకి వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమే అని సీఎం రేవంత్ జోస్యం చెప్పారు. తలరాతలు మారాలంటే చదువు ఒక్కటే మార్గమని సీఎం రేవంత్ స్పష్టం చేశారు. డీలిమిటేషన్ జరిగితే 117 సీట్లతో అధికారంలోకి వస్తామని విశ్వాసం వ్యక్తం చేశారు. కేసీఆర్ సీఎం అయితే.. ఆయన కుమారుడు వర్కింగ్ ప్రెసిడెంట్ అయ్యారని గుర్తు చేశారు. కానీ రేవంత్ ముఖ్యమంత్రి అయితే.. మహేష్ కుమార్ గౌడ్ పీసీసీ చీఫ్ అయ్యారని.. అలాగే కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే సీతక్క, వాకిటి శ్రీహరి మంత్రులయ్యారని సోదాహరణంగా వివరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుదీరిన తర్వాత ఉద్యమకారులకు కీలక పదవులు ఇచ్చామని గుర్తు చేశారు. శ్రీకాంతచారి తల్లి శంకరమ్మ, చాకలి ఐలమ్మ మనవరాలికి పదవులిచ్చామని పేర్కొన్నారు. అయితే కేసీఆర్ మాత్రం ఎర్రబెల్లి, వినోద్‌రావుకు పదవులిచ్చారని వ్యంగ్యంగా అన్నారు. కేసీఆర్ సీఎం అయితే.. వారి కుటుంబ సభ్యులకు ఫామ్‌హౌజ్‌లు వచ్చాయని ఎద్దేవా చేశారు. అదే కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పేదలకు ఇందిరమ్మ ఇళ్లు వస్తున్నాయని వివరించారు. దిశ బాగుంటుందని కేసీఆర్ కొత్త సచివాలయం కట్టుకున్నారని తెలిపారు. కానీ కేసీఆర్ దిశ, దశ బాగా లేదు.. అందుకే తాను, భట్టి సచివాలయంలో ఉన్నామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెప్పారు. బీసీల లెక్కలు తేల్చిన తొలి ప్రభుత్వం మాదేనని అన్నారు. కేసీఆర్ చేసిన రూ.8 లక్షల కోట్ల అప్పు తెలంగాణ పాలిట ముప్పుగా మారిందని ఆందోళన వ్యక్తం చేశారు. అలాగే గౌడ సామాజికవర్గం సహకారంతో వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ మరోసారి అధికారంలోకి వస్తుందని సీఎం ధీమా వ్యక్తం చేశారు. పీసీసీ అధ్యక్షుడిగా మహేశ్‌కుమార్ గౌడ్‌తో కలిసి పనిచేస్తున్నామని, తమ కాంబినేషన్‌లో 2029లోనూ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తామని అన్నారు. ఇందిరమ్మ పాలనలో తెలంగాణ బహుజనుల తెలంగాణగా మారుతుందని సీఎం అన్నారు. సామాజిక న్యాయం, సమాన అవకాశాలు కల్పించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. సర్వాయి పాపన్న ఆలోచనలకు అనుగుణంగా పేదలు ఆత్మగౌరవంతో జీవించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు.పేదలకు ఇందిరమ్మ ఇళ్లు, విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్, సన్నబియ్యం వంటి కార్యక్రమాలను ప్రస్తావించారు. గత పదేళ్ల పాలనపై సీఎం తీవ్ర విమర్శలు చేశారు. గత పాలకులు కులవృత్తులు చేసుకోవాలని చెప్పారని, తమ ప్రభుత్వం మాత్రం సామాజిక న్యాయానికి ప్రాధాన్యం ఇస్తోందన్నారు. 'కేసీఆర్‌ది ఫ్యామిలీ జస్టిస్ అయితే.. మాది సోషల్ జస్టిస్' అని వ్యాఖ్యానించారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్‌కు 117 సీట్లు వస్తాయని రేవంత్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. ప్రభుత్వం ప్రజలదేనని, మరోసారి పాత పాలనకు వెళ్లకుండా ప్రజలు ఆలోచించి నిర్ణయం తీసుకోవాలని కోరారు. ప్రభుత్వం కుటుంబంలా పనిచేస్తోందని, ఏ సమస్య ఉన్నా చర్చించి పరిష్కరించుకునే విధానాన్ని అనుసరిస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో మంత్రులు పొన్నం ప్రభాకర్, తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, శ్రీధర్‌బాబు, సీతక్క తదితరులు పాల్గొన్నారు. ఎమ్మెల్యేలు, ఎంపీలు, కాంగ్రెస్ నాయకులతో పాటు బీసీ సంఘాల ప్రతినిధులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.



# పాపన్న గౌడ్ పోరాట స్ఫూర్తిని యువత ఆదర్శంగా తీసుకోవాలి

**సర్వాయి పాపన్న గౌడ్ ఆశయాలు నేటి తరానికి స్ఫూర్తిదాయకం..**

**ఘనంగా సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతి వేడుకలు.**

**గద్వాల జిల్లా ప్రతినిధి,ఆగస్టు 18(ప్రభాత ఉదయం)**

గద్వాల పట్టణంలో సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతి సందర్భంగా గౌడ నాయకులు, బిజెపి జిల్లా పార్టీ ఆద్వర్యంలో క్రిష్ణ వేణి చౌక్ దగ్గర ఉన్న ఆయన విగ్రహానికి పూల మాల వేసి నివాళులర్పించిన నాయకులు...ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు రామాంజనేయులు మాట్లాడుతూ.. బడుగు, బలహీన వర్గాల హక్కుల కోసం పోరాడిన సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ ధైర్యసాహసాలు, సామాజిక సమానత్వం కోసం ఆయన చేసిన పోరాటం నేటి తరానికి స్ఫూర్తిదాయకమని అన్నారు. సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ ఆశయాలను ముందుకు తీసుకెళ్లేందుకు యువత ఐక్యంగా కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఆయన చూపిన ధైర్యం, సమాజం కోసం చేసిన పోరాటాన్ని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని అన్నారు. గౌడ నాయకులు తులసిగౌడు, సందీప్ గౌడు,మధుగౌడు, పవన్ కుమార్ గౌడు, జమ్మిచేడు రామచంద్ర గౌడు, మల్దకల్ వి ఎల్ కుమార్ గౌడు, ఉప్పేరు రఘుగౌడ్ , ఈ కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ బండల వెంకట రాములు, జిల్లా ప్రధాన కార్యదర్శి రవి కుమార్ ఎక్బోటే, మాజీ బిజెవైఎం జిల్లా అధ్యక్షుడు మిర్జాపురం వెంకటేస్వర రెడ్డి, ఓబీసీ మోర్చా అధ్యక్షుడు దాస్, కౌన్సిలర్లు శాలన్న, చంద్రశేఖర్, రాష్ట్ర ఓబీసీ మోర్చాకార్యవర్గ సభ్యులు అనిల్ బిజెపి సీనియర్ నాయకులుమాజీ కౌన్సిలర్ నల్లారెడ్డి,శ్రీమన్నారాయణ, శంకర్,బిజెవైఎం నాయకులు పాండు ,మోహన్ రెడ్డి,సతీష్,రమేష్, పవన్ ,బజరంగ్ భాస్కర్,మహిల మోర్చా భారతి తదితరులు హాజరయ్యారు..

# దిమాగీ నక్సల్స్.. మరో పార్టీ పుట్టుక

**మొదటి పేజీ తరువాయి...**

చేసిన 24 గంటల్లోనే దిమాగీ నక్సల్ అనే పేరుతో ఇన్‌స్టాగ్రామ్, ఎక్స్‌లో తెరిచిన పార్టీ ఖాతాలకు అనూహ్య ఆదరణ లభించింది. ఇన్‌స్టాలో 1.81 లక్షలమంది, ఎక్స్‌లో 7000 మంది ఆ ఖాతాలను అనుసరించారు. ఇన్‌స్టాలో దిమాగి నక్సల్ జనతా పార్టీ అనే పేరుతో ఖాతాలు తెరిచారు. యువత ప్రశ్నించడమే కాదు, సమస్యలకు పరిష్కార మార్గాలను కూడా వెతకాలని ప్రధాని నరేంద్ర మోదీ ఇటీవల ఐఐటీ ఢిల్లీ యాభై ఏడవ స్నాతకోత్సవంలో చేసిన వ్యాఖ్యల సంగతి ఎలా ఉన్నా యువత ప్రశ్నిస్తూనే ఉంది. సమస్యలకు పరిష్కారాం చూపాలని ప్రధాని మోడీ అనడం చూస్తుంటే..పాలకులు ఎందుకన్న ప్రశ్న ఉదయిస్తోంది. నిజానికి సమస్యలను పరిష్కరించాల్సిన బాధ్యత ఎవరిది? అధికారంలో ఉన్న పాలకులదాకాదా అన్నది తేల్చాలి. 2014లో బీజేపీ కేంద్రంలో అధికారంలోకి వచ్చినప్పుడు యువతకు ఎన్నో ఆశలు కల్పించింది. ఉద్యోగాల కల్పన, నైపుణ్యాభివృద్ధి, తయారీ రంగం విస్తరణ, పెట్టుబడుల పెంపు, అవినీతి నిర్మూలన, నల్లధనాన్ని వెనక్కి రప్పించడం వంటి అంశాలపై ఎన్నో హామీలు ఇచ్చారు. అవన్నీ మరచిపోవడం మోడీకి తగదు. ఇవన్నీ పక్కన పెట్టి దిమాగీ నక్సల్స్ అని మేధావులను దూషించడం కూడా సరికాదు. ఇప్పటివరకు యువతకు ఎన్ని ఉద్యోగాలు వచ్చాయంటే.. చెప్పలేం. ఆందోళనలు చేస్తున్న యువతను చూసైనా పాలకులు కళ్లు తెరవాలి. పేపర్ లీకేజీలతో విద్యార్థుల ఆశలపై నీల్లు చల్లడం వల్లనే కదా యువత ఆందోళన బాట పట్టింది. నీట్ వివాదం ఈ పరిస్థితికి ఒక ఉదాహరణ మాత్రమే. విద్యార్థులు నెలల తరబడి ఆందోళనలు చేస్తే, వారి సమస్యలను వినడం, విచారణ జరిపించడం, బాధ్యులపై చర్యలు తీసుకోవడం లాంటి పనులను ప్రభుత్వం చేయడంలేదు. పైగా నిరసనకారులకు 'పరిష్కారం మీరే చూపండి' అని చెప్పడం ద్వారా ఏం సందేశాన్ని ఇవ్వదలుచుకున్నారో మేడీ చెప్పాలి. ఈ చర్య నిశితంగా పరిశీలిస్తే ప్రభుత్వం పాలనా బాధ్యతలు నుంచి తప్పించుకునేందుకు ప్రయత్నిస్తున్నట్టుగా ఉంది. పరిష్కారం చూపాలంటే ముందు యువతకు అధికారంలో భాగస్తామ్యం కల్పించాలి. నిజానికి యువత కోరుతున్నది కూడా ఈ దేశ అభివృద్ధిలో తమను కూడా భాగస్వాముల్ని చేయమని, తమకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించమని అంటున్నారు. తద్వారా వికసిత భారత్‌లో తమను కూడా భాగస్వాములను చేయమంటున్నారు. ఇవి ఏవీ జరగకుండా, అన్నింటికీ దూరంగా ఉంచడం వల్ల అభివృద్ధి ఎలా జరుగుతుందని అనుకుంటున్నారో వివరించాలి. యువత ప్రశ్నలు నీట్‌కే పరిమితం కావాల్సిన అవసరం లేదు. పెరుగుతున్న విదేశీ అప్పు, ధరలు, నిరుద్యోగం, అవినీతి ఆరోపణలు, పరిపాలనలో జవాబుదారీతనం, రాజకీయ ఫిరాయింపులు, దర్యాప్తు సంస్థలు, ఎన్నికల వ్యవస్థ వంటి కీలక సంస్థల స్వతంత్రతపై వ్యక్తమవుతున్న సందేహాలు.. ఇవన్నీ ప్రశ్నించాల్సిన అంశాలే. అయితే ప్రభుత్వం తన అధికారాన్ని ప్రశ్నను అణచడానికి కాకుండా, సమస్యను పరిష్కరించడానికి వినియోగిస్తే అసలు సమస్యే ఉండదు. కానీ ప్రభుత్వ ధోరణి అలా కనిపించడం లేదు. యువత పరిష్కారాలు చూపాలి, అయితే ప్రభుత్వాన్ని ప్రశ్నించకూడదు అంటే కుదరదు. అందుకుఏ దిమాగీ నక్సల్ అనగానే పార్టీ పుట్టుకు వచ్చింది. ఇది ఓ రకంగా ప్రశ్నించడానికే అనుకోవాలి. ప్రశ్నలకు నాయకులు పరిష్కారాలు చూపించడానికి సిద్ధంగా ఉండాలి.

# నేను కూడా దిమాగీ నక్సలైట్‌నే

**న్యూఢిల్లీ, ఆగస్టు 18 (ప్రభాత ఉదయం)**

ప్రశ్నించే వారంతా దిమాగీ నక్సల్స్ అంటూ తాజాగా ఆప్ కనన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ అన్నారు. ఇప్పటికే చిదంబరం తదితరులు ఇలాంటి వ్యాఖ్యలే చేశారు. తాజాగా అరవింద్ కేజ్రీవాల్ కూడా మోడీ వ్యాఖ్యలకు ఘాటుగానే స్పందించారు. స్వాతంత్య్ర దినోత్సవ వేడుకల సందర్భంగా దిమాగీ నక్సల్స్ అంటూ ప్రధాని మోదీ చేసిన వ్యాఖ్యలపై దుమారం రేగుతూనే ఉంది. మోదీ వ్యాఖ్యలపై స్పందించిన ఆమ్ ఆద్మీ పార్టీ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్.. తను దిమాగీ నక్సల్ అయినందుకు గర్వపడుతున్నానని చెప్పారు. తను నిజమైన దేశభక్తుడినని.. బీజేపీకి భయపడేవాడిని కాదని అన్నారు. 80వ స్వాతంత్య్ర వేడుకల్లో ప్రధాని మోదీ చేసిన వ్యాఖ్యలు తీవ్ర వివాదాస్పదం అయిన విషయం తెలిసిందే. దేశంలో ఆయుధాలు పట్టి అడవుల్లో ఉండే నక్సల్స్ ను అంతం చేశామని.. దిమాగీ నక్సల్స్ హింసను ప్రేరేపించేందుకు ఎదురు చూస్తున్నారని.. సమాజాన్ని తప్పుడు దోవ పట్టించేందుకు సిద్ధంగా ఉన్నారని వ్యాఖ్యానించిన విషయం తెలిసిందే. ల్గ÷ర్యంగా ప్రశ్నించే వారు దిమాగీ నక్సల్స్.. ఎవరైతే బీజేపీకి భయపడకుండా ప్రశ్నిస్తారో వాళ్లంతా మోదీ దృష్టిలో దిమాగీ నక్సల్స్. ఒకవేళ భగత్ సింగ్ , అంబేద్కర్ ఇప్పటికీ బతికే ఉంటే.. వాళ్లను కూడా ప్రధాని మోదీ.. దిమాగీ నక్సల్స్ అనేవారేమోనని మండిపడ్డారు. జవాబుదారీ వ్యవస్థ, అవినీతి లేని సమాజం, ప్రజలకు సౌకర్యాలు, హాస్పిటల్స్ స్కూల్స్, , డ్రైనేజీ సిస్టమ్ మొదలైన వాటిపై ప్రశ్నించే వారు మోదీ దృష్టిలో దిమాగీ నక్సల్సేనా అని ప్రశ్నించారు. నేను నిజమైన దేశ భక్తుడిని అందుకే నేను దిమాగీ నక్సల్.. అంటూ చెప్పుకొచ్చారు.

### హైదరాబాద్ మెట్రో ఫేజ్-2

# అనుమతులకు కసరత్తు

**మొదటి పేజీ తరువాయి...**

పాల్గొన్నారు. కేంద్ర అనుమతుల కోసం డీపీఐటీ నెట్‌వర్క్ ఎ÷-లానింగ్ గ్రూప్ పక్రియలో భాగంగా ఈ సమావేశం నిర్వహించారు. ఫేజ్?2లో భాగంగా 7 కారిడార్ల ద్వారా మొత్తం 122.9 కిలోమీటర్ల మేర మెట్రోను విస్తరించేందుకు ప్రతిపాదనలు ఉన్నాయి. ఇందుకు సంబంధించిన భూసేకరణ, రైల్వే క్రాసింగ్‌లు, మూసీ నది దాటే ప్రాంతాలు, గ్యాస్ పైప్‌లైన్లు, విమానాశ్రయ పరిధిలో నిర్మాణ అనుమతులపై సమావేశంలో చర్చ జరిగింది. ప్రతిపాదిత కారిడార్లకు అన్ని శాఖలు త్వరితగతిన ఎన్‌సీఓలు జారీ చేయాలని సర్ఫరాజ్ అహ్మద్ విజ్ఞప్తి చేశారు. ఫేజ్?2 పనులు ముందుకు సాగితే హైదరాబాద్‌లో ప్రజా రవాణా వ్యవస్థ మరింత విస్తరించి, నగరంలో ప్రయాణ సౌకర్యాలు మెరుగుపడే అవకాశం ఉంది.

# క్రిమినల్ కేసుల్లో రేవంత్ టాప్

**మొదటి పేజీ తరువాయి...**

సుమారు 251 మందిపై, రాజ్యసభలోని 233 మంది సభ్యులలో 75 మందిపై క్రిమినల్ కేసులు ఉన్నాయని ఈ నివేదిక వెల్లడించింది.

**ఏళ్ల తరబడి పెండింగ్‌లోనే..**

ప్రస్తుతం పెండింగ్‌లో ఉన్న 4,192 కేసుల్లో 519 కేసులు పదేళ్లకు పైగా కోర్టుల గడప దాటలేదంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. మరో 700 కేసులు ఇంకా దర్యాప్తు దశలోనే ఉన్నాయి. అందులో 260 కేసులు మూడేళ్లుగా ఎక్కడివక్కడే ఆగిపోయాయి. ఈ కేసుల్లో ఇంకా ఛార్జిషీట్లు కూడా దాఖలు కాలేదు. సుప్రీంకోర్టుకు సమర్పించిన అఫిడవిట్ ప్రకారం.. కేరళకు చెందిన ఎంపీల్లో ఏకంగా 95 శాతం మందిపై నేరారోపణలు ఉన్నాయి. దేశంలోనే ఇది అత్యధికం అని 'ది న్యూ ఇండియన్ ఎక్స్‌ప్రెస్' పేర్కొంది. కేరళ తర్వాత స్థానంలో తెలంగాణ (82 శాతం) నిలిచింది. ఆ తర్వాత ఒడిశా (76 శాతం) ఉంది. అత్యల్పంగా హరియాణా, ఛత్తీస్‌గఢ్‌లలో ఒక్కో ఎంపీ మాత్రమే కేసులు ఎదుర్కొంటున్నారు. ఇక తీవ్రమైన కేసులు ఎదుర్కొంటున్న ఎమ్మెల్యేల విషయానికి వస్తే.. పశ్చిమ బెంగాల్ (58 శాతం) మొదటి స్థానంలో ఉండగా, కేరళ (57 శాతం) రెండో స్థానంలో ఉంది. ఆ తర్వాత ఆంధ్రప్రదేశ్ (56 శాతం), తెలంగాణ (49 శాతం), ఒడిశా (45 శాతం) తర్వాతి స్థానాలను ఆక్రమించాయని 'ది టైమ్స్ ఆఫ్ ఇండియా' నివేదించింది.

**ముఖ్యమంత్రులపై కేసులు..**

ఈ నివేదిక ప్రకారం.. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై అత్యధికంగా 89 కేసులు ఉన్నట్లు తేలింది. ఆ తర్వాత పశ్చిమ బెంగాల్‌కు చెందిన సువేందు అధికారి 29 పెండింగ్ కేసులతో తర్వాతి స్థానంలో ఉన్నారు. కర్ణాటక ముఖ్యమంత్రి డీకే శివకుమార్, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి ఎన్ చంద్రబాబు నాయుడు ఇద్దరూ చెరో 19 కేసులు ఎదుర్కొంటుండగా, కేరళకు చెందిన వీడీ సతీశన్ వద్ద 18 కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. ఈ విషయాలు వెలుగులోకి రావడంతో సిట్టింగ్, మాజీ శాసనసభ్యులపై ఉన్న ఈ కేసులను త్వరితగతిన విచారించడానికి ప్రత్యేక కోర్టులను ఏర్పాటు చేయాలని అమికస్ క్యూరీ కోర్టును అభ్యర్థించారు. అలాగే, ఈ కేసుల విచారణ పురోగతిని ఆయా హైకోర్టులు స్వయంగా పర్యవేక్షించేలా ఆదేశాలు జారీ చేయాలని ఆయన సుప్రీంకోర్టును కోరారు.



# ఘనంగా సర్దార్ పాపన్న జయంతి

**గద్వాల జిల్లా ప్రతినిధి,ఆగస్టు18(ప్రభాత ఉదయం)**

సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ జయంతి వేడుకలను కేటిదొడ్డి మండల కేంద్రంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గౌడ సంఘం మండలాధ్యక్షుడు యుగందర్ గౌడ్ ఆధ్వర్యంలో పాపన్న చిత్ర పటానికి గద్వాల మార్కెట్ యార్డు చైర్మన్ కుర్వ హన్మంతు, మండల నాయకులు పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మార్కెట్ యార్డ్ చైర్మన్ హనుమంతు, మండల అధ్యక్షుడు ఉరుకుంద మాట్లాడుతూ.. సబ్బండ వర్గాల కృషి చేసిన వ్యక్తి సర్వాయి పాపన్న అని, ఆయన జీవిత చరిత్ర నేటి సమాజానికి ఆదర్శమని, పాపన్న ఆశయ సాధనకు ప్రతీ ఒక్కరు కృషి చేయాలని వారు పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు మరియు స్థానిక ప్రజలు విశేష సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ కార్యక్రమం లో సర్పంచ్ నారాయణ ఉప సర్పంచ్ వీరన్నగౌడ్ వార్డ్ మెంబర్లు ఆర్ వీరన్న, జంగిలప్ప నాయకులు కొండన్న, డి.వీరన్న పిల్లి గోవిందు ఫీల్డ్ అసిస్టెంట్ వీరన్న డి రంగస్వామి గౌడ సంఘం నాయకులు పెద్దరాములగౌడ్ చిన్న రాములు గౌడ్, వెంకన్న గౌడ్, అశోక్ గౌడ్ సత్యన్న గౌడ్, వికాస్ గౌడ్ దినేష్ గౌడ్ లింగప్ప గౌడ్ , మీసేవ రవిబాబు, తదిదితరులు పాల్గొన్నారు

# సాగుతోనే భవిష్యత్తు : వ్యవసాయ శాఖామంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు

**బుద్వేల్, ఆగస్టు 18 (ప్రభాత ఉదయం)**

సాగు తోనే భవిష్యత్తు అని, ఆ దిశ గా రైతు నిలదొక్కుకునే పద్ధతులు రావాలని, అదే సందర్భంలో ప్రయోగశాలలో జరిగిన పరిశోధన ఫలితాలు రైతులకు చేరాలని తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు అన్నారు. శ్రీ కొండా లక్ష్మణ్ తెలం గాణ ఉ ద్యాన విశ్వవిద్యాలయం పరిధిలోని రాజేంద్రనగర్ ఉద్యాన కళాశాలలో రూ. 10 కోట్లతో నిర్మిం చనున్న హార్టికల్చర్ రీసెర్చ్ కాంప్లెక్స్ కు ఆయన మంగళవారం రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి ప్రకాశ్ గౌడ్, వ్యవసాయ శాఖ కార్యదర్శి సురేంద్ర మోహన్, ఉద్యాన విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ డాక్టర్ దండ రాజిరెడ్డి లతో కలసి శంకుస్థాపన చేశారు. దాంతో పాటు సీడ్ ప్రాసెసింగ్ ప్లాంట్ ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన వివిధ కూరగాయల ఎగ్జిబిషన్ ను వారు తిలకించారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు మాట్లాడుతూ, తెలంగాణ గ్రామీణ యువత ఆవిష్కరణలు బేష్ అని అన్నారు. వ్యవసాయంలో అవసరాలే ఆవిష్కరణలకు దారి తీస్తున్నాయన్నారు. వ్యవసాయ, ఉద్యాన రం గాలు లాభసాటిగా ఉండాలంటే ప్రతి ఆధునిక టెక్నాలజీ రైతులకు చేరాలని, చిన్న, సన్నకారు రైతులకు అధునాతన సాగుపద్ధతులు చేరాలన్నారు. రైతులు స్వంతంగా విత్తనోత్పత్తి చేసుకునే రకాలు శాస్త్రవేత్తలు రూపొందించి రైతులకు అందించాలన్నారు. కరోనా సమయంలో అన్ని ఇతర వ్యాపారాలు రద్దయినప్పటికి వ్యవసాయమే సాగిందని గుర్తు చేశారు. ఫామ్ ఆయిల్ సాగులో తెలంగాణ నెంబర్ -1 స్థానానికి ఎదిగిందని, రెండు మూడు సంవత్సరాలలో రాష్ట్రంలో 10 లక్షల ఎకరాలకు ఆయిల్ ఫామ్ సాగు



రాజేంద్రనగర్ లో హార్టికల్చర్ రీసెర్చ్ కాంప్లెక్స్ కు శంకుస్థాపన చేస్తున్న వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి ప్రకాష్ గౌడ్ లు



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

చేరుకుంటుందన్నారు. ప్రతి మండలం, జిల్లా కేంద్రాలలో ఆధునిక సమాచారం తో కూడిన డెమోలు రైతులకు అందుబాటులో ఉంచాలన్నారు. ఒకప్పుడు నెయ్యి అమ్ముకుని పెళ్లిళ్లు చేసేవారని, పొలాలు కొనేవారని, రైతు స్వంత విత్తనాలు ఉత్పత్తి చేసుకునేవారని గుర్తు చేశారు. హరిత విప్లవం తో భూములు విషతుల్యమయ్యాయని, రసాయన ఎరువులు, పురుగు మంతులు విచక్షణరహితంగా వాడటం వల్ల చాలా దేశాలు మన ఉత్పత్తులను ఎగుమతి చేసుకోవడం లేదని మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు గురు చేశారు.

**ఉద్యాన విశ్వవిద్యాలయం భూములను కాపాడుకోవాలి : ఎమ్మెల్యే టి ప్రకాశ్ గౌడ్ :**

ఉద్యాన విశ్వవిద్యాలయం భూములను కాపాడుకుంటేనే భవిష్యత్తు అని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి ప్రకాశ్ గౌడ్ అన్నారు. అందుకోసం ఉద్యాన విశ్వవిద్యాలయం అధికారులు కృషి చేయాలన్నారు. వ్యవసాయ శాఖ కార్యదర్శి సురేంద్ర మోహన్ మాట్లాడుతూ, ఎల్నీనో పరిస్థితులను ఎదుర్కొనేందుకు ముందుగానే ఏప్రిల్ నుంచి కంటెన్జెన్సీ ప్రణాళిక సిద్ధంగా ఉంచాలన్నారు. అధిక దిగుబడులు ఇచ్చే చీడ పీడలను తట్టుకునే ఉద్యాన పంట రకాలను రూపొందించాలని ఉద్యాన శాఖ డైరెక్టర్ షేక్ యాస్మీన్ బాషా అన్నారు. కూరగాయలు, పూలు, ఔషధ మొక్కలు: విత్తనాలపై సమగ్ర పరిశోధనలు చేపట్టేందుకు హార్టికల్చరల్ రీసెర్చ్ కాంప్లెక్స్ ఏర్పాటు చేస్తున్నామని వర్శిటీ వైస్ చాన్సలర్ డాక్టర్ దండ రాజిరెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో విత్తన దృవీకరణ అథారిటీ డైరెక్టర్ డాక్టర్ ఎ కిరణ్ కుమార్, రిజిస్ట్రార్ డాక్టర్ భగవాన్, డీన్ డాక్టర్ చీనా, పరిశోధన సంచాలకులు డాక్టర్ లక్ష్మీనారాయణ, పీజీ డీన్ డాక్టర్ సురేశ్, బోర్డు సభ్యులు పంకజ్ రెడ్డి, శిఖామణి, అనిల్ ఇ పూర్, డాక్టర్ పి ప్రశాంత్, డాక్టర్ అనితా కుమారి, డాక్టర్ మురళి, డాక్టర్ వీరాంజనేయులు, డాక్టర్ సునందిని, ప్రొఫెసర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.



షారోన్ మినిస్ట్రీస్ వ్యవస్థాపకులు రెవరెండ్ పి సత్యానందం ను సన్మానిస్తున్న రాజేంద్రనగర్ పాస్టర్స్ ఫెలోషిప్ ప్రతినిధులు

## అపవిత్రత కు దూరంగా ఉంటూ లోకానికి వేరై జీవించాలి : రెవరెండ్ పి సత్యానందం

**బుద్వేల్, ఆగస్టు 18 (ప్రభాత ఉదయం) :**

యేసయ్య ను వెంబడిస్తు ఆయన సేవ చేస్తున్న సేవకులు పవిత్రమైన జీవితాన్ని జీవించాలని, ఎలాంటి అపవిత్రత ఉన్న దాన్ని తీసి వేయాలని షారోన్ మినిస్ట్రీస్ వ్యవస్థాపకులు రెవరెండ్ పి సత్యానందం అన్నారు. మంగళవారం గంధం గూడ శాంతి నగర్ లో గల జీసస్ ఎవాంజెలికల్ ఫెలోషిప్ చర్చ్ లో చర్చ్ పాస్టర్ రెవరెండ్ డాక్టర్ బట్టు సుజాత ఆధ్వర్యంలో రాజేంద్రనగర్ పాస్టర్స్ ఫెలోషిప్ సంయుక్త కార్యదర్శి పాస్టర్ సోమారం రాజ్ కుమార్ అధ్యక్షతన జరిగిన రాజేంద్రనగర్ పాస్టర్స్ ఫెలోషిప్ సమావేశంలో ఆయన పాల్గొని బైబిల్ సందేశాలను అందచేశారు. లోకం నుండి, లోకాశాల నుంచి దూరంగా ఉండాలని సూచించారు. దానియేలు వలె మోకాళ్ళ ప్రార్థన అనుభవం కలిగి ఉండాలన్నారు. దేవునికి లోబడి జీవించాలన్నారు. దేవుని లో పవిత్రంగా ఉంటు ప్రార్థిస్తే జరుగవు అనుకున్న పనులు కూడా జరిగిస్తాడన్నారు. ఆత్మలో ప్రార్థించే వారిగా ఉండాలన్నారు. చేంజ్, ఛాలెంజ్, చాంపియన్ అనే విధంగా క్రైస్తవ జీవితం ఉంటుందన్నారు. అంటే క్రైస్తవ జీవితంలోకి మారితే అనేక సవాళ్లు ఎదురవుతాయని, వాటిని తట్టుకుని ముందుకు సాగితే చాంపియన్ లుగా నిలబడగలుగుతామన్నారు. సమావేశంలో గవర్నింగ్ బాడి సభ్యులు రెవరెండ్ పి స్వర్ణ కుమార్, రెవరెండ్ కె సుందర్ పాల్, రాజేంద్రనగర్ పాస్టర్స్ ఫెలోషిప్ అధ్యక్షులు రెవరెండ్ సీ హెచ్ సునీల్ సామ్యూల్, ప్రధాన కార్యదర్శి పాస్టర్ బి ప్రణీత్ బాబు, కోశాధికారి పాస్టర్ బట్టు శ్రీకాంత్, కమిటీ సభ్యులు రెవరెండ్ ఎం విజయ కుమార్, పాస్టర్ గుంటి డానియల్, ఇశ్రాయేలు రాజ్ కుమార్, పాస్టర్ యేసు రత్నం, క్రైస్తవ నాయకులు బ్రదర్ జి విజయ్ రాజ్, బ్రదర్ రగడంపల్లి శ్రావణ్ లు పాల్గొన్నారు.



## మైలార్‌దేవ్‌పల్లి పీహెచ్‌సీని ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా అదనపు కలెక్టర్ డాక్టర్ కిరణ్మయ్

**ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలి..**

**రాజేంద్రనగర్,ఆగస్టు19(ప్రభాత ఉదయం)**

మైలార్‌దేవ్‌పల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మంగళవారం రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ డాక్టర్ కిరణ్మయి ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ వైద్య కేంద్రంలోని వైద్య సేవలు,రోగుల నమోదు, సిబ్బంది హాజరు, మందుల లభ్యత,ల్యాబొరేటరీ సేవలు,శుభ్రత, రికార్డుల నిర్వహణ తదితర అంశాలను పరిశీలించారు.మంత్రం అదనపు కలెక్టర్ మాట్లాడుతూ...ఆసుపత్రికి వచ్చే ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలని సిబ్బందికి సూచించారు.ప్రభుత్వం అందిస్తున్న ఉచిత వైద్య సేవలు,మందులు,వివిధ ఆరోగ్య కార్యక్రమాల ప్రయోజనాలను ప్రజలకు పూర్తిస్థాయిలో అందేలా చూడాలని అధికారులను ఆదేశించారు.రోగులతో మర్యాదగా వ్యవహరిస్తూ,వారి సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు.ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పారిశుద్ధ్యం, బయోమెడికల్ వ్యర్థాల నిర్వహణ,అవసరమైన మందుల నిల్వ తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు.జిల్లా వైద్య, ఆరోగ్య అధికారి డాక్టర్ స్వర్ణ కుమారి మాట్లాడుతూ... జిల్లాలోని అన్ని ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాల్లో వైద్య సేవల నాణ్యతను నిరంతరం పర్యవేక్షిస్తున్నామని తెలిపారు.ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా వైద్య సిబ్బంది సేవలు అందించాలని సూచించారు. ఈ ఆకస్మిక తనిఖీలో వైద్యులు,ఆరోగ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



రాజేంద్రనగర్ చేరుకున్న ప్రజా చైతన్య యాత్ర

## రాజేంద్రనగర్ చేరుకున్న సీపీఐ ప్రజా చైతన్య బస్సు యాత్ర

**బుద్వేల్, ఆగస్టు 18 (ప్రభాత ఉదయం):**

కేంద్రంలోని ప్రధానమంత్రి నరేంద్ర మోడి, ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక, ఉ ద్యోగ, కార్మిక వ్యతిరేక విధానాలను సీపీఐ తీవ్రంగా వ్యతిరేకిస్తుందని, ఆ పార్టీ జాతీయ సమితి సభ్యులు పాలమాకుల జంగయ్య అన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం చేపడుతున్న ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తు సీపీఐ ఆధ్వర్యంలో చేపడుతున్న ప్రజా చైతన్య బస్సు యాత్ర మంగళవారం రాజేంద్రనగర్ కు చేరుకుంది. రాజేంద్రనగర్ మండల సీపీఐ కార్యదర్శి కన్యగారి నర్సింహ్మారెడ్డి ఆధ్వర్యంలో ప్రజా చైతన్య యాత్ర లో పాల్గొన్న నాయకులకు ఘన స్వాగతం పలికి సన్మానించారు. బస్సు యాత్రలో సీపీఐ నాయకులు ఎ రవీంద్రా చారి, పుస్తకాల నర్సింగ్ రావు, పానుగంటి పర్వతాలు, బి జంగయ్య, టి రామక్రిష్ణ, ఎం ప్రభులింగం, శ్రీదేవి, దత్తు నాయక్, విద్యార్థి నాయకులు గ్యార క్రాంతి, ఎస్ వంశీవర్ధన్ రెడ్డి, సుధాకర్, జె ఆనంద్ గౌడ్, కన్యగారి లక్ష్మి, జె విజయానంద్ గౌడ్, జి సత్యం, ఎం ఎ రియాజ్ తదితరులు పాల్గొన్నారు.



## కాంగ్రెస్ వైఫల్యాలపై ధ్వజమెత్తిన మాజీ కార్పొరేటర్ కొమిరిశెట్టి సాయిబాబా

**శేరిలింగంపల్లి : ఆగస్టు18, (ప్రభాత ఉదయం)**



కేసీఆర్ హయాంలో పేదల కోసం ప్రవేశపెట్టిన కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ సహా పలు సంక్షేమ పథకాలను కాంగ్రెస్ ప్రభుత్వం నిర్వీర్యం చేస్తోందని ఆరోపిస్తూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు శేరిలింగంపల్లి నియోజకవర్గం గచ్చిబౌలి డివిజన్ నానక్‌రాం గూడలో భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు. గచ్చిబౌలి డివిజన్ పార్టీ కార్యాలయం నుండి నానక్‌రాంగూడలోని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహం వరకు ఈ ర్యాలీ సాగింది. శేరిలింగంపల్లి సీనియర్ నాయకులు గచ్చిబౌలి డివిజన్ మాజీ కార్పొరేటర్ కొమిరిశెట్టి సాయిబాబా ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ముందుగా అంబేద్కర్, బాబు జగ్జీవన్ రామ్ విగ్రహాలకు వినతిపత్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా కొమిరిశెట్టి సాయిబాబా మాట్లాడుత ఎన్నికల హామీ మేరకు కళ్యాణలక్ష్మి కింద రూ 1 లక్ష చెక్కుతో పాటు తులం తక్షణమే అందించాలని డిమాండ్ చేశారు. శేరిలింగంపల్లి నియోజకవర్గంలోనే సుమారు 5,000 మంది ఆడబిడ్డలకు కాంగ్రెస్ ప్రభుత్వం తులం బంగారం బకాయి పడిందని రేవంత్ రెడ్డికి గుర్తు చేశారు. కేసీఆర్ హయాంలో కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ ద్వారా సుమారు 13 లక్షల మంది ఆడబిడ్డలకు రూ 13 వేల కోట్ల ఆర్థిక సహాయం అందించారని తెలిపారు. మహిళలకు నెలకు రూ 2,500, రూ 500 లకే గ్యాస్ సిలిండర్, ఆసరా పెన్షన్ 4,000 తదితర హామీలను వెంటనే అమలు చేయాలని హెచ్చరించారు. కెసిఆర్ కిట్, న్యూట్రిషన్ కిట్లు, కంటి వెలుగు వంటి ప్రజాదరణ పొందిన పథకాలను రేవత్ ప్రభుత్వం రద్దు చేయడం దారుణం అన్నారు. కళ్యాణలక్ష్మిపై కోర్టులో ప్రభుత్వం తన వైఖరిని స్పష్టంగా ప్రకటించాలని మంచి న్యాయవాదులో స్టే వికెట్ చేయించాలన్నారు. ప్రభుత్వం పాలనలో పూర్తిగా వైఫల్యం చెందిందనడానికి సొంత ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి చేసిన వ్యాఖ్యలే నిదర్శనం పేదల సంక్షేమాన్ని పక్కన పెడితే ప్రజా పోరాటాలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు అంజమ్మ, బాలమణి, మాధవి, సుగుణ, రాగం జంగయ్య యాదవ్, రాగం హరి శంకర్ యాదవ్, సతీష్ ముదిరాజ్, నారాయణ, నరేష్ సింగ్, అనిల్ సింగ్, మధు కుమార్, ఖాదర్ ఖాన్, రమేష్ గౌడ్, ప్రభాకర్, అజీమ్, థాహెర్, బురాన్ తదితర ముఖ్య నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## చికిత్స పొందుతు శ్రీలత అనే మహిళ మృతి

**ఆసుపత్రి ముందు బంధువుల నిరసన**

**బుద్వేల్, ఆగస్టు 18 (ప్రభాత ఉదయం)**



జాయ్ హాస్పిటల్ ముందు నిరసన తెలుపుతున్న శ్రీ లత కుటుంబ సభ్యులు, బంధువులు

అత్తాపూర్ జాయ్ ఆసుపత్రి వైద్యుల నిర్లక్ష్యం కారణంగానే కార్వాన్ వడ్డెర బస్తీకి చెందిన శ్రీలత (30) అనే మహిళ మరణించిందని ఆరోపిస్తు ఆమె కుటుంబ సభ్యులు, బంధువులు ఆసుపత్రి ముందు నిరసన వ్యక్తం చేశారు. వివరాలు ఈ విదంగా ఉ న్నాయి.... కార్వాన్ వడ్డెర బస్తీకి చెందిన తిరుపతి, శ్రీలత లు భార్యభర్తలు. దినసరి కూలీలుగా పనిచేస్తు జీవనం సాగిస్తున్నారు. ఆదివారం శ్రీలత కు జ్వరం రావడంతో దగ్గర లోని ఆర్ఎంపీ వైద్యులు అశోక్ దగ్గరకు వెల్లింది. అశోక్ శ్రీలత కు ఇంజక్షన్ ఇచ్చి ఇంటికి పంపించేశాడు. ఇంటికి వెల్లిన శ్రీలత కు కాళ్లు వాపు, నొప్పులు ప్రారంభమయ్యాయి. ఆర్ఎంపీ వైద్యున్ని సంప్రదించగా, వెంటనే అత్తాపూర్ జాయ్ ఆసుపత్రికి తెల్లండని చెప్పాడని శ్రీలత కుటుంబ సభ్యులు తెలిపారు. ఆదివారం సాయంత్రం నుంచి సోమవారం రాత్రి వరకు బాగేనే ఉన్న శ్రీలత ఆ తర్వాత ఆరోగ్యం క్షీణించసాగింది. ఆమెను జాయ్ ఆసుపత్రిలో ఐసీయు కు షిఫ్ చేశారు. చికిత్స పొందుతున్న శ్రీలత మంగళవారం తెల్లవారు జామున మృతి చెందిం ది. జాయ్ ఆసుపత్రి వైద్యుల నిర్లక్ష్యం మూలంగానే శ్రీలత మరణించిందని, ఆరోపిస్తు మృతురాలు కుటు ంబ సభ్యులు ఆసుపత్రి ముందు ఆందోళన కు దిగారు. ఆసుపత్రి ముందు ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు మృతురాలు శ్రీలత బందువుల ను అక్కడినుంచి పంపించివేశాడు. శ్రీలత కుటుంబ సభ్యులు ఇచ్చిన పిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## మద్యం మత్తులో స్నేహితుల మధ్య ఘర్షణ ఓ యువకుడు మృతి

**బుద్వేల్, ఆగస్టు 18 (ప్రభాత ఉదయం)**


మరణించిన అనికేత్

మద్యం మత్తులో యువకుల మధ్య జరిగిన ఘర్షణ ఓ య ఎవకుడి హత్యకు దారి తీసింది. ఈ సంఘటన రాజేంద్రనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని రివర్స్ కేఫ్ సమీపంలో జరిగింది. రాజేంద్రనగర్ ఇన్స్పెక్టర్ వెంకటేశ్ తెలిపిన వివరాలు ఈ విదంగా ఉన్నాయి... బీహార్ రాష్ట్రానికి చెందిన అనికేత్ (20), అదే రాష్ట్రానికి చెందిన రోహిత్, రాహుల్, అంకిత్ లు బం డ్లగూడ సరస్వతీ విద్యాపీఠం సమీపంలోని రివర్స్ కేప్ విల్లాలో దినసరి కూలీలుగా పనిచేస్తున్నారు. సోమవారం రాత్రి విధులు ముగించుకున్న అనంతరం నలుగురు యువకులు కలసి మద్యం సేవించారు. ఈ సందర్భంగా అనికేత్ అనే యువకునితో మిగతా ముగ్గురు రోహిత్, రాహుల్, అంకిత్లు గొడవ పడ్డారు. గొడవ పెద్దదిగా మారింది. రాహుల్ ఇనుప రాడ్ తో అనికేత్ ను తలపై వెనుక బాగంలో బలం గా కొట్టాడు. దీంతో అనికేత్ అపస్మారక స్థితికి చేరుకున్నాడు. ఆసుపత్రికి తరలించగా, అప్పటికే అనికేత్ మరణించినట్లు వైద్యులు తెలిపారు. రాజేంద్రనగర్ పోలీసులు కేసు నమోదు చేసుకుని ధర్యాప్తు చేసు న్నారు.



## పీవీ నర్సింహ్మారావు ఎక్స్‌ప్రెస్‌వేపై కారు బోల్తా

**బుద్వేల్, ఆగస్టు 18 (ప్రభాత ఉదయం) :**

రాజేంద్రనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోకి వచ్చే పీవీ నరసింహారావు ఎక్స్ ప్రెస్ వే పిల్లర్ నెంబర్ 172 పైన మంగళవారం టీఎస్06 ఈయు 8766 నెంబర్ కారు పల్టీ కొట్టింది. మెహిదీపట్నం నుంచి ఆరాంఘర్ వైపు వెళ్తున్న కారు అదుపు తప్పి డీవైడర్ ను ఢీ కొట్టడంతో పల్టీ కొట్టింది. ఆ సమయం లో కారులో డ్రైవర్ ఒక్కరే ఉ న్నారు. ఎవరికి ఎలాంటి ప్రమాదం జరుగలేదు. ప్రమాదం తో పీవీ నర్సింహ్మారావు ఎక్స్ ప్రెస్ వే పై ట్రాఫిక్ జామ్ అయ్యింది. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని ట్రాఫిక్ ను క్లియర్ చేశారు.

# ఒక శ్రమజీవి సామాజిక వర్గానికి చెందిన వ్యక్తి ప్రజల మద్దతుతో అధికారాన్ని నిర్మించడం విప్లవాత్మక పరిణామం

**ప్రజల శ్రమతో నిర్మితమైన రాజ్యంలో ప్రజలకే అధికారం ఉండాలనే పాపన్న సందేశం నేటికీ సజీవంగానే ఉంది**

**పీసీసీ సభ్యులు, టీపీసీసీ అధికార ప్రతినిధి డా. సత్యం శ్రీరంగం**

**కూకట్ పల్లి, ఆగస్టు 18 (ప్రభాత ఉదయం)**




గోల్కొండ కోటపై జెండా ఎగురవేసిన తొలి బహుజన చక్రవర్తి సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతిని పురస్కరించుకొని గౌడ సంఘం, బాలాజీనగర్ డివిజన్ అధ్యక్ష్యులు రాజేష్ గౌడ్, గౌడ సంఘం ప్రధాన కార్యదర్శి రాచమల్ల శేఖర్ గౌడ్ ల ఆహ్వానాల మేరకు కెపిహెచ్బి టెంపుల్ బస్టాండ్, మూసాపేట్ లో ఏర్పాటు చేసిన సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 376వ జయంతి వేడుకలకు టీపీసీసీ అధికార ప్రతినిధి డా. సత్యం శ్రీరంగం ముఖ్య అతిధిగా హాజరై పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా సత్యం శ్రీరంగం మాట్లాడుతూ అణగారిన వర్గాలు కేవలం పాలనను అనుసరించే ప్రజలు మాత్రమే కాదని అవసరమైతే తమ హక్కుల కోసం పోరాడగలరని, తమ నాయకత్వాన్ని తాము నిర్మించుకోగలరని పాపన్న తన జీవితంతో నిరూపించాడు అని అన్నారు. భూస్వాములు, దేశముఖ్ లు, జాగీర్దార్లు వంటి స్థానిక అధికార కేంద్రాల ఆధిపత్యం సామాన్య ప్రజల జీవితాలపై తీవ్ర ప్రభావం చూపేది అని ఈ పరిస్థితులను చూసిన పాపన్నలో తిరుగుబాటు భావం బలపడింది. అయితే తన అసంతృప్తిని వ్యక్తిగత పోరాటానికే పరిమితం చేయలేదు వివిధ సామాజిక వర్గాల ప్రజలను సమీకరించి ఒక శక్తివంతమైన ఉద్యమాన్ని నిర్మించాడు. ప్రజల స్వయం పాలనకు ప్రతీకలు భారత చరిత్రలో రాజ్యాధికారం ప్రధానంగా వంశపారం పర్యంగా సంక్రమించిన కాలంలో, ఒక శ్రమజీవి సామాజిక వర్గానికి చెందిన వ్యక్తి ప్రజల మద్దతుతో అధికారాన్ని నిర్మించడం విప్లవాత్మక పరిణామం. అణగారిన వర్గాల ఆత్మగౌరవానికి, సామాజిక న్యాయానికి బాటలు వేసిన పోరాటయోధుడు అని పాపన్న జీవితంలో మనకు కనిపించే గొప్ప గుణం– ఓటమిని అంతి మంగా భావించకపోవడం. ఆయన జయంతి సందర్భంగా వారి పోరాట స్ఫూర్తిని ఆదర్శంగా తీసుకొని ముందుకు సాగుదాం అని అన్నారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ఉపాధ్యక్షులు గోపిశెట్టి రాఘవేందర్, బి బ్లాక్ అధ్యక్షులు తూము వేణు, డివిజన్ అధ్యక్షుడు దెంది అరవింద్ రెడ్డి, శేరి సతీష్ రెడ్డి, కొప్పిశెట్టి దినేష్, ఏఎంసీ డైరెక్టర్లు ఫణి కుమార్, సుధాకర్ రెడ్డి, భిక్షపతి గౌడ్, డివిజన్ మాజీ అధ్యక్షులు సతీష్ గౌడ్, కేబుల్ శ్రీను, రంగ మోహన్, నితీష్ గౌడ్, మణి గౌడ్, స్వరూప గౌడ్, పొన్నం రజిత గౌడ్, బచ్చు మల్లి, ప్రభాకర్, కిరణ్, పాండు ముదిరాజ్, శ్రీధర చారి, కళ్యాణ్ బాబు, దుర్గ ప్రసాద్, గౌడ సంఘ సభ్యులు, నాయకులు, అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# బహుజన రాజ్య స్థాపనకు సర్వాయిపాపన్న చేసిన పోరాటం చిరస్మరణీయం

**టిపీసీసీ ఉపాధ్యక్షులు బండి రమేష్**

**కూకట్ పల్లి, ఆగస్టు 18 (ప్రభాత ఉదయం)**



బహుజనుల బాగుకోసం కత్తిపట్టిన పోరాడిన వీరుడు సర్వాయి పాపన్న జయంతి ఉత్సవాలు మూసాపేటలోని జనతానగర్ లో శేఖర్ గౌడ్, బి బ్లాక్ అధ్యక్షులు తూము వేణు ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. ఈ వేడుకల్లో టిపీసీసీ ఉపాధ్యక్షులు, కూకట్ పల్లి పార్టీ ఇంచార్జ్, కమ్మ కార్పొరేషన్ చైర్మన్ బండి రమేష్ పాల్గొని పాపన్న విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ బహుజన రాజ్య స్థాపనకు సర్వాయిపాపన్న పోరాటం చేసి చరిత్రలో చిరస్మరణీయుడు అయ్యారని, నేటి కాంగ్రెస్ ప్రభుత్వం కూడా బహుజనులకు సముచిత స్తానం కల్పించి గౌరవించుకుంటుం దన్నారు. ఈ కార్యక్రమంలో ఏ బ్లాక్ అధ్యక్షులు నాగిరెడ్డి, సీనియర్ నాయకులు కర్క పెంటయ్య, డివిజన్ ప్రెసిడెంట్ తూము సంతోష్ , డివిజన్ ప్రెసిడెంట్ కలికోట శంకర్, సీనియర్ నాయకులు సునీల్, నాగరాజు, యూత్ కాంగ్రెస్ సలీం, సీనియర్ నాయకులు చున్నుపాషా, కేబుల్ శ్రీను, మధు, సప్పిడి భాస్కర్, సచిన్, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.



# కూకట్‌పల్లి గౌడ్ సంగం ఆధ్వర్యంలో ఘనంగా సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతి వేడుకలు

**కూకట్‌పల్లి, ఆగస్టు 18 (ప్రభాత ఉదయం)**

సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతి సందర్భంగా కూకట్‌పల్లి ఈస్ట్ కమాన్ వద్ద కూకట్‌పల్లి గౌడ్ సంగం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ 249వ డివిజన్ నాయకులు పాల్గొని సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్‌కు ఘన నివాళులు అర్పించారు.ఈ కార్యక్రమంలో గొట్టిముకుల వెంకటేశ్వర్ రావు, గొట్టిముకుల జెశ్వంత్ రావు, బి. సంజీవ్ రావు, గుడెపు నాగరాజు, మేకల రమేష్, బి. జ్యోతి, కొండల్ రెడ్డి, టి. కృష్ణవేణి, గోవింద్ గౌడ్, గుండమల్ల రాజేంద్ర, మేకల మహేష్ బాబు, బచ్చాల రవి, అనిల్, కొమ్ము బాబు, శివ, వినయ్ గౌడ్, సతీష్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ ధైర్యం, పోరాట స్ఫూర్తి, సామాజిక న్యాయం కోసం ఆయన చేసిన కృషి నేటి తరానికి స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించిన కూకట్‌పల్లి గౌడ్ సంగం వారికి కాంగ్రెస్ పార్టీ 249వ డివిజన్ తరపున ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

# చిన్నగోల్కొండ సహకార సంఘంలో అవకతవకలపై విచారణ జరపాలి..

**రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు,కంటెస్టెడ్ ఎమ్మెల్యే తోకల శ్రీనివాస్‌రెడ్డి డిమాండ్**

**శంషాబాద్,ఆగస్టు18(ప్రభాత ఉదయం)**



రాజేంద్రనగర్ నియోజకవర్గం శంషాబాద్ మండలంలోని చిన్నగోల్కొండ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో సుమారు 15సంవత్సరాలుగా జరిగినట్లు ఆరోపణలు వస్తున్న సుమారు రూ.11కోట్ల అవకతవకలపై సమగ్ర విచారణ జరిపించి బాధితులకు న్యాయం చేయాలని రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు,కంటెస్టెడ్ ఎమ్మెల్యే తోకల శ్రీనివాస్‌రెడ్డి కోరారు. చిన్నగోల్కొండ సహకార సంఘంలో జరిగిన ఆర్థిక అవకతవకల కారణంగా పేద,మధ్యతరగతి కుటుంబాలకు చెందిన పలువురు బాధితులు తీవ్రంగా నష్టపోయారని నాయకులు తెలిపారు.తమకు జరిగిన నష్టంపై విచారణ జరిపించి న్యాయం చేయాలని బాధితులు తోకల శ్రీనివాస్‌రెడ్డిని కలిసి తమ సమస్యను వివరించారు.బాధితుల సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని కోరుతూ తోకల శ్రీనివాస్‌రెడ్డి చేవెళ్ల పార్లమెంట్ సభ్యుడు కొండా విశ్వేశ్వర్‌రెడ్డితో కలిసి రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డిని కలిశారు.ఈ సందర్భంగా స్థానిక నాయకులు,బాధితులతో కలిసి కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు.చిన్నగోల్కొండ సహకార సంఘంలో సుమారు 15 సంవత్సరాలుగా జరిగినట్లు చెబుతున్న ఆర్థిక లావాదేవీలు, నిధుల వినియోగం,బాధితుల ఖాతాలకు సంబంధించిన అంశాలపై సమగ్రంగా విచారణ జరిపించాలని కోరారు.అవకతవకలకు బాధ్యులైన సంబంధిత అధికారులపై విచారణ జరిపించి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని విజ్ఞప్తి చేశారు.సహకార సంఘంలో డబ్బులు నష్టపోయిన పేద,మధ్యతరగతి కుటుంబాలకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని కోరారు.బాధితుల నుంచి అందిన ఫిర్యాదులను పరిశీలించి సంబంధిత రికార్డులు,ఖాతాలు, ఆర్థిక లావాదేవీలను సమగ్రంగా తనిఖీ చేయాలని నాయకులు కోరారు.నష్టపోయిన బాధితులకు వారి సొమ్ము తిరిగి అందేలా తగిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.సహకార సంఘాల నిర్వహణలో పారదర్శకత పాటించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని,ప్రజల సొమ్ముకు భద్రత కల్పించే విధంగా పర్యవేక్షణ వ్యవస్థను బలోపేతం చేయాలని కోరారు.బాధితులకు న్యాయం జరిగే వరకు వారి తరపున పోరాడుతామని తోకల శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు.సమగ్ర విచారణ అనంతరం వాస్తవాలు వెలుగులోకి తీసుకువచ్చి బాధితులకు న్యాయం జరిగేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు ,గ్రామ పెద్దలు నారాయణరెడ్డి,అంజయ్యగౌడ్,రామ్‌రెడ్డి, జగన్మోహన్‌రెడ్డి, లక్ష్మీకాంత్‌రెడ్డి, రాజు తదితరులు పాల్గొన్నారు.



# కుంగిన వంతెనపై అధికారుల నిర్లక్ష్యం

**పరిశీలనలు కాదు.. ప్రజలకు తక్షణ పరిష్కారం కావాలి**

**బీజేపీ సీనియర్ నాయకులు కాంచి మహేందర్**

**కూకట్ పల్లి, ఆగస్టు 18 (ప్రభాత ఉదయం)**

కూకట్ పల్లి నియోజకవర్గం, ఫతేనగర్ డివిజన్ పరిధిలోగల నేతాజీ కాలనీ--శోభన కాలనీల మధ్య కాలువపై ఉన్న వంతెన కుంగిపోయి ప్రమాదకరంగా మారినప్పటికీ అధికారులు పట్టించుకోవడం లేదని బీజేపీ సీనియర్ నాయకులు కాంచి మహేందర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. వంతెనకు ఆనుకుని భారీగా చెత్త పేరుకుపోవడంతో స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆయన తెలిపారు. సుమారు పది రోజుల క్రితం మాజీ కార్పొరేటర్, ఏఈ అధికారులు అక్కడికి వచ్చి పరిస్థితిని పరిశీలించినప్పటికీ, ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని విమర్శించారు. కుంగిపోయిన వంతెనతో పాటు పేరుకుపోయిన చెత్త కారణంగా ఎప్పుడైనా ప్రమాదం జరిగే అవకాశం ఉందని, ప్రజల ప్రాణాలకు ముప్పు వాటిల్లకముందే అధికారులు స్పందించాలని కాంచి మహేందర్ డిమాండ్ చేశారు. అధికారులు వచ్చారు.. పరిశీలించారు.. వెళ్లిపోయారు. కానీ సమస్య మాత్రం అలాగే ఉంది. పరిశీలనలు, హామీలతో సమస్య పరిష్కారం కాదు. ప్రజలకు తక్షణమే శాశ్వత పరిష్కారం కల్పించాలి" అని ఆయన అన్నారు. ఫతేనగర్‌లో నెలకొన్న ఈ పరిస్థితిపై అధికారులు వెంటనే స్పందించి కుంగిపోయిన వంతెనకు మరమ్మతులు చేపట్టడంతో పాటు పేరుకుపోయిన చెత్తను తొలగించాలని కాంచి మహేందర్ కోరారు. "ఇదేనా మన ఫతేనగర్ పరిస్థితి?" అని ఆయన ప్రశ్నించారు.




అంజయ్య నగర్ దోమల నివారణ చర్యలు చేస్తున్న ఎంటమాలజీ సిబ్బంది..

# ప్రజావాణి ఫిర్యాదుకు 'గ్రేటర్' అధికారుల స్పందన:

**అంజయ్య నగర్‌లో ముమ్మరంగా దోమల నివారణ చర్యలు**

**శేరిలింగంపల్లి : ఆగష్టు 18,(ప్రభాత ఉదయం)**

ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా నిర్వహిస్తున్న 'ప్రజావాణి' కార్యక్రమానికి అధికారుల నుంచి తక్షణ స్పందన లభించింది. అంజయ్య నగర్ డివిజన్ పరిధిలో తీవ్రరూపం దాల్చిన దోమల నివారణపై డివిజన్ నాయకులు ఆంజనేయులు సాగర్ ప్రజావాణిలో అధికారులకు వినతిపత్రం అందజేశారు. డివిజన్ ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని వెంటనే చర్యలు తీసుకోవాలని డిప్యూటీ కమిషనర్ బాలకృష్ణ, అడిషనల్ కమిషనర్‌లను కోరారు.

**అధికారుల ఆదేశాలతో రంగంలోకి ఎంటమాలజీ సిబ్బంది**

సమస్య తీవ్రతను గుర్తించిన డిప్యూటీ కమిషనర్ బాలకృష్ణ వెంటనే స్పందించారు. అధికారుల ఆదేశాలతో మంగళవారం ఉదయమే ఎంటమాలజీ విభాగానికి చెందిన ప్రత్యేక సిబ్బంది అంజయ్య నగర్‌కు చేరుకుని స్ప్రేయింగ్, ఫాగింగ్ కార్యక్రమాలను ముమ్మరంగా చేపట్టారు. కాలనీలోని వీధులు, మురుగు నీటి కాలువల వద్ద దోమల మందును పిచికారీ చేశారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ కేవలం ఒక ప్రాంతానికే పరిమితం కాకుండా డివిజన్ పరిధిలోని మిగతా కాలనీలు, బస్తీలలో కూడా దశలవారీగా స్ప్రేయింగ్ నిర్వహిస్తామని తెలిపారు. సీజనల్ వ్యాధులు వ్యాపించకుండా దోమల వ్యాప్తిని అరికట్టేందుకు అన్ని రకాల ముందుజాగ్రత్త చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు.

**అధికారులకు కృతజ్ఞతలు:**

ప్రజావాణిలో ఫిర్యాదు చేసిన మరుసటి రోజే క్షేత్రస్థాయిలో చర్యలు చేపట్టి, ప్రజల ఆరోగ్య పరిరక్షణకు ప్రాధాన్యత ఇచ్చిన డిప్యూటీ కమిషనర్ బాలకృష్ణకు, అడిషనల్ కమిషనర్‌కు జీహెచ్ఎంసీ ఎంటమాలజీ సిబ్బందికి నాయకులు ఆంజనేయులు సాగర్ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. అధికారుల తక్షణ స్పందన పట్ల స్థానిక ప్రజలు సైతం హర్షం వ్యక్తం చేస్తున్నారు.



నూతన కార్యవర్గాని సన్మానిస్తున్న రవి కుమార్ యాదవ్..

# ఆర్యవైశ్యుల సంక్షేమానికి కృషి చేయాలి

**నూతన ఆర్యవైశ్య మహాసభ కార్యవర్గానికి బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రవికుమార్ యాదవ్ అభినందనలు**

**శేరిలింగంపల్లి : ఆగష్టు 18,(ప్రభాత ఉదయం)**

శేరిలింగంపల్లి మండల ఆర్య వైశ్య మహాసభ కార్యవర్గ ఎన్నికలలో ఏకగ్రీవంగా ఎన్నికైన నూతన కార్యవర్గ సభ్యులకు బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, శేరిలింగంపల్లి అసెంబ్లీ ఇంచార్జి రవికుమార్ యాదవ్ ప్రత్యేక అభినందనలు తెలియజేశారు. మసీద్ బండలోని భారతీయ జనతా పార్టీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో నూతన కార్యవర్గ సభ్యులను ఆయన ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా రవికుమార్ యాదవ్ మాట్లాడుతూ నూతనంగా ఏకగ్రీవంగా ఎన్నికైన మండల అధ్యక్షులు ప్రభాకర్ గుప్తా, ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లు, కోశాధికారి శూల్యలింగం, ఉపాధ్యక్షులు సందీప్, జగన్మోహన్ గుప్తా, ఇతర కార్యవర్గ సభ్యులకు అలాగే వారిని ఎన్నుకున్న సంఘ ప్రతినిధులకు శుభాకాంక్షలు తెలిపారు. సంఘం అభివృద్ధికి, సభ్యుల సంక్షేమానికి నూతన కార్యవర్గం కట్టుబడి ఉండాలని, సామాజిక సేవా కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనాలని పిలుపు నిచ్చారు. శేరిలింగంపల్లి నియోజకవర్గ పరిధిలోని ప్రతి ఆర్యవైశ్య సంఘ సభ్యులను కలుపుకొనిపోతూ ఐక్యంగా ముందుకు సాగాలని, పేద, మధ్యతరగతి వర్గాలకు నిరంతరం సహాయ సహకారాలు అందించాలని సూచించారు. సంఘానికి భవిష్యత్తులో ఏ అవసరం వచ్చినా, ఎలాంటి సహాయ సహకారాలు కావాలన్నా తాను ఎల్లప్పుడూ అండగా ఉంటానని ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఫౌండర్ రాజు గుప్తా, అశోక్ గుప్తా, పాండు గుప్తా, రేఖ, ఆనంద్ గుప్తా, సంతోష్, కమలాకర్ తోపాటు ఇతర ఆర్య వైశ్య సంఘ సభ్యులు పాల్గొన్నారు.



నానక్ రామ్ గూడలో అంబేద్కర్, బాబు జగజీవన్ రామ్ ల విగ్రహాలకు వినతి పత్రం అందిస్తున్న బీఆర్ ఎస్ నాయకులు..

# నానక్‌రాంగూడలో బీఆర్ఎస్ నిరసన ర్యాలీ

**కాంగ్రెస్ వైఫల్యాలపై ధ్వజమెత్తిన మాజీ కార్పొరేటర్ కొమిరిశెట్టి సాయిబాబా**

**శేరిలింగంపల్లి : ఆగస్టు18, (ప్రభాత ఉదయం)**

కేసీఆర్ హయాంలో పేదల కోసం ప్రవేశపెట్టిన కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ సహా పలు సంక్షేమ పథకాలను కాంగ్రెస్ ప్రభుత్వం నిర్వీర్యం చేస్తోందని ఆరోపిస్తూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు శేరిలింగంపల్లి నియోజకవర్గం గచ్చిబౌలి డివిజన్ నానక్‌రాంగూడలో భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు. గచ్చిబౌలి డివిజన్ పార్టీ కార్యాలయం నుండి నానక్‌రాంగూడలోని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహం వరకు ఈ ర్యాలీ సాగింది. శేరిలింగంపల్లి సీనియర్ నాయకులు గచ్చిబౌలి డివిజన్ మాజీ కార్పొరేటర్ కొమిరిశెట్టి సాయిబాబా ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ముందుగా అంబేద్కర్, బాబు జగ్జీవన్ రామ్ విగ్రహాలకు వినతిపత్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా కొమిరిశెట్టి సాయిబాబా మాట్లాడుత ఎన్నికల హామీ మేరకు కళ్యాణలక్ష్మి కింద రూ 1 లక్ష చెక్కుతో పాటు తులం తక్షణమే అందించాలని డిమాండ్ చేశారు. శేరిలింగంపల్లి నియోజకవర్గంలోనే సుమారు 5,000 మంది ఆడబిడ్డలకు కాంగ్రెస్ ప్రభుత్వం తులం బంగారం బకాయి పడిందని రేవంత్ రెడ్డికి గుర్తు చేశారు. కేసీఆర్ హయాంలో కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ ద్వారా సుమారు 13 లక్షల మంది ఆడబిడ్డలకు రూ 13 వేల కోట్ల ఆర్థిక సహాయం అందించారని తెలిపారు. మహిళలకు నెలకు రూ 2,500, రూ 500 లకే గ్యాస్ సిలిండర్, ఆసరా పెన్షన్ 4,000 తదితర హామీలను వెంటనే అమలు చేయాలని హెచ్చరించారు. కెసిఆర్ కిట్, న్యూట్రిషన్ కిట్లు, కంటి వెలుగు వంటి ప్రజాదరణ పొందిన పథకాలను రేవత్ ప్రభుత్వం రద్దు చేయడం దారుణం అన్నారు. కళ్యాణలక్ష్మిపై కోర్టులో ప్రభుత్వం తన వైఖరిని స్పష్టంగా ప్రకటించాలని మంచి న్యాయవాదులో స్టే వికెట్ చేయించాలన్నారు. ప్రభుత్వం పాలనలో పూర్తిగా వైఫల్యం చెందిందనడానికి సొంత ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి చేసిన వ్యాఖ్యలే నిదర్శనం పేదల సంక్షేమాన్ని పక్కన పెడితే ప్రజా పోరాటాలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు అంజమ్మ, బాలమణి, మాధవి, సుగుణ, రాగం జంగయ్య యాదవ్, రాగం హరి శంకర్ యాదవ్, సతీష్ ముదిరాజ్, నారాయణ, నరేష్ సింగ్, అనిల్ సింగ్, మధు కుమార్, ఖాదర్ ఖాన్, రమేష్ గౌడ్, ప్రభాకర్, అజీమ్, థాహెర్, బురాన్ తదితర ముఖ్య నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఉన్న రోడ్డు తవ్వారు... గుంతలు చేసి వదిలేసారు..

**రెండు నెలలు గడుస్తున్నా పూర్తికాని బాలాజీ నగర్ కాలనీ రోడ్డు నిర్మాణం**

**పొంచి ఉన్న ప్రమాదం ... స్థానికుల ఆందోళన**

**పటాన్ చెరు, ఆగస్టు 18 (ప్రభాత ఉదయం):**



నిర్మాణం పేరుతో ఉన్న రోడ్డు తవ్వేసారు.. డ్రైనేజీ వ్యవస్థ గురించి పిర్యాదు చేసినందుకు సుమారు రెండు నెలలు కాలం గడుస్తున్నా పట్టించుకున్న దాఖలాలు లేవు.. ఇదీ బొల్లారం డివిజన్ పరిధిలోని బాలాజీ నగర్ పరిధిలోని ఓ రోడ్డు పరిస్థితి. రోడ్డు నిర్మాణం పనుల్లో భాగంగా బొల్లారం డివిజన్ పరిధిలోని అన్ని కాలనీ ప్రాంతాల్లో రోడ్ల నిర్మాణానికి ఎమ్మెల్యే శంకుస్థాపనలు చేసారు. అందులో భాగంగానే బాలాజీ నగర్ కాలనీలోని ఓ నిర్మాణం కోసం పనులు మొదలుపెట్టారు. కాగా అంతర్గత మురుగు నీరు పైపులు భూమి లోపల ఉండిపోవడం వల్ల భవిష్యత్తులో మురుగు నీరు పారుదల సమస్యలు తలెత్తుతాయని స్థానికులు నిర్మాణం పనులు చేపట్టిన గుత్తేదారుకు తెలిపారు. దీంతో రోడ్డు నిర్మాణం పనుల్లో భాగంగా ఉన్న రోడ్డు కన్నా లోతుగా తవ్వి మురుగు నీరు కాలువపై మూతలు బయటపడే విధంగా రోడ్డు తవ్వారు. రోడ్డు తవ్వడం మూలంగా గుంతలు ఏర్పడ్డాయి తప్ప ఎలాంటి ప్రయోజనం లేకపోగా చిన్న పిల్లలు ఆ గుంతల్లో పడి ప్రమాదాల బారిన పడే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. సమస్య చెప్పినందుకు పరిష్కారం చేయకపోగా సమస్య తీవ్రత మరింత పెరిగిందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తక్షణమే చర్యలు తీసుకోవాలని రోడ్డు నిర్మాణం పనులు పూర్తి చేయాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

# గట్టు ఎత్తిపోతల సామర్థ్యం పెంపుకు కృతజ్ఞతగా సీఎం రేవంత్ రెడ్డి ని కలిసిన గద్వాల ఎమ్మెల్యే, నాయకులు





**గద్వాల జిల్లా ప్రతినిధి,ఆగస్టు 18(ప్రభాత ఉదయం)**

గద్వాల నియోజకవర్గ రైతాంగం చిరకాల స్వప్నమైన నల్ల సోమనాద్రి గట్టు ఎత్తిపోతల పథకం నీటి నిల్వ సామర్థ్యాన్ని 1.3 టీఎంసీల నుంచి 3 టీఎంసీలకు పెంచుతూ, దీనికి రూ.1,781 కోట్ల నిధులు మంజూరు చేయడం, గూడెందొడ్డి రిజ్వాయర్ సామర్థ్యం 1.9 టిఎంసీ నుండి 15 టిఎంసీలకు పెంచుతూ ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన రాష్ట్ర క్యాబినేట్ సమావేశంలో ఆమోదం తెలిపింది. ఇందుకు గాను కృతజ్ఞతగా గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణ మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో నాయకులు, రైతులు సోమవారం హైదరబాద్ లో తెలంగాణ సీఎం ఎనుముల రేవంత్ రెడ్డి ని మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ..గద్వాల నియోజకవర్గ అభివృద్ధి బాధ్యత తనపై ఉందని, అన్ని విధాలుగా అభివృద్ధి చేసేందుకు నా వంతుగా కృషి చేస్తాను అని, కచ్చితంగా భవిష్యత్తులో గద్వాల నియోజకవర్గంలో అన్ని రంగాల్లో అభివృద్ధి చెందేలా ప్రత్యేకమైన నిధులు కేటాయించి గద్వాల నియోజకవర్గాని రాష్ట్రంలో అగ్రస్థానంలో తీసుకువెళ్లేవిధంగా కృషి చేస్తానని పేర్కొన్నారు. భవిష్యత్తులో గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డికి మీరంతా అండగా ఉండాలని తెలిపారు. ఈ సందర్భంగా గద్వాల ఎమ్మెల్యే మాట్లాడుతూ..గద్వాల నియోజకవర్గ రైతాంగం ప్రజల అభివృద్ధి కొరకు నిరంతరం కృషి చేయడం జరుగుతుంది. సీఎం రేవంత్ రెడ్డి క్యాబినెట్ సమావేశంలో ప్రత్యేకంగా గద్వాల నియోజకవర్గానికి సంబంధించిన నీటిపారుదల గట్టు ఎత్తిపోతల పథకం, గుడ్డెందొడ్డిరిజర్వాయర్లకు నిధులు కేటాయించడం చాలా సంతోషకరమని పేర్కొన్నారు. రైతాంగానికి శాశ్వతమైన నీటి సమస్యను పరిష్కరించే విధంగా ప్రభుత్వం దురదృష్టతో ఆలోచించడం జరిగింది.సీఎం రేవంత్ రెడ్డి మంత్రి వర్గానికి గద్వాల నియోజకవర్గ ప్రజల తరఫున రైతాంగం తరఫున హృదయపూర్వక ప్రత్యేకమైన ధన్యవాదాలు తెలిపారు.ఈ కార్యక్రమంలో నాయకులు ప్రజా ప్రతినిధులు, గద్వాల నియోజకవర్గ రైతాంగం, నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



## అరగిద్దలో బాలల హక్కుల పరిరక్షణ వేదిక గ్రామ స్థాయి సమావేశం

**గద్వాల జిల్లా ప్రతినిధి,ఆగస్టు18(ప్రభాత ఉదయం)**

గట్టు మండలం అరగిద్ద గ్రామంలో బాలల హక్కులు, పరిరక్షణ చట్టాలు, ఎంవి ఫౌండేషన్, డి సి పి యు సేవలు చైల్డ్ హెల్ప్‌లైన్ సేవలపై మంగళవారం విస్తృత అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఓ ఆర్ డబ్ల్యూ లక్ష్మీదేవి మాట్లాడుతూ... అరగిద్ద గ్రామాన్ని సంపూర్ణ బాలల స్నేహపూర్వక గ్రామంగా తీర్చిదిద్దాలని, గ్రామంలో ఎట్టి పరిస్థితుల్లోనూ బాల్యవివాహాలు జరగకుండా ప్రతి ఒక్కరూ బాధ్యత వహించాలని పిలుపునిచ్చారు.అనంతరం ఏం వి ఎఫ్ మండల ఇన్‌ఛార్జ్ కిరణ్ కుమార్ మాట్లాడుతూ... సమాజంలో జెండర్ సమానత్వం అత్యంత ఆవశ్యకమని, ఇంట్లోనూ, బయటా అమ్మాయిలను, అబ్బాయిలను సమానంగా చూడాలని పేర్కొన్నారు. ఈ సంవత్సరం కేబిఎస్, టి ఏ ఎస్ ఎస్ పిల్లల ఆధ్వర్యంలో జెండా ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించడం అభినందనీయమన్నారు. గ్రామాన్ని బాలకార్మికులు లేని గ్రామంగా మార్చడమే లక్ష్యంగా అందరూ పనిచేయాలని కోరారు.వెట్టిచాకిరీ నుంచి బాలుడికి విముక్తి -- కేసు నమోదుఇదే సందర్భంలో ఒక ప్రేరణాత్మక కార్యక్రమాన్ని నిర్వహించారు. పెంచికలపాడు గ్రామంలో గొర్రెల కాపరిగా వెట్టిచాకిరీ చేస్తున్న కె నరేష్ అనే బాలుడిని గుర్తించి, బాధ్యులపై చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. వెట్టిచాకిరీ చేయిస్తున్న అరగిద్ద గ్రామానికి చెందిన యజమాని నగేష్‌పై స్థానిక పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి, బాలుడిని చైల్డ్ వెల్ఫేర్ కమిటీ ముందు హాజరుపరిచినట్లు నిర్వాహకులు వెల్లడించారు.ఈ కార్యక్రమంలో గ్రామానికి చెందిన ప్రజలు, బాలల హక్కుల పరిరక్షణ కమిటీ ప్రతినిధులు, యువకులు మరియు గ్రామస్థులు పాల్గొన్నారు.




## ఛాయాచిత్రం అద్భుతం..

**ప్రకృతి ఒడిలో పరమశివుడు.**

**ప్రియదర్శిని జూరాల అందాల సోయగం**

**గద్వాల జిల్లా ప్రతినిధి,ఆగస్టు18(ప్రభాత ఉదయం)**



ప్రకృతి అందాలను, ఆధ్యాత్మిక వైభవాన్ని ఒకే ఫ్రేమ్‌లో అద్భుతంగా ఒడిసిపట్టిన ఛాయాచిత్రం చూపరులను విశేషంగా ఆకట్టుకుంటోంది. నేడు ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా సంగాల పార్క్ వద్ద ధరూర్ మండలం నెట్టెంపాడు గ్రామానికి చెందిన ఫోటోగ్రాఫర్ గోవింద్ తీసిన ఈ చిత్రం ప్రకృతి ప్రేమికులను, ఫోటోగ్రఫీ అభిమానులను ఆకట్టుకుంటోంది.పచ్చని చెట్లు.. రంగురంగుల పూలు.. విశాలమైన పచ్చిక బయలు.. ఆహ్లాదకరమైన వాతావరణం మధ్య కొలువుదీరిన పరమశివుని విగ్రహం ఈ చిత్రానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ముందుభాగంలో పూలను, పచ్చని మొక్కలను అందంగా ఫోకస్ చేస్తూ.. మధ్యలో శివుని విగ్రహాన్ని స్పష్టంగా చూపించిన తీరు ఫోటోగ్రాఫర్ ప్రతిభకు అద్దం పడుతోంది.ప్రకృతి ఒడిలో ప్రశాంతంగా కొలువైన శివుని రూపం.. మరియు ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు నందు కృష్ణమ్మ అందాలను పచ్చదనం ఆహ్లాదకరమైన వాతావరణం ఇలా ప్రతి అంశాన్ని సమన్వయం చేస్తూ తీసిన ఈ ఛాయాచిత్రం చూసిన వారిని కాసేపు ఆ దృశ్యంలో మమేకం చేస్తోంది. ఒక సాధారణ దృశ్యాన్ని కూడా కళాత్మక దృష్టితో చూస్తే ఎంత అద్భుతమైన ఛాయాచిత్రంగా మలచవచ్చో ఈ చిత్రం చాటిచెబుతోంది.“ఒక మంచి ఛాయాచిత్రం వెయ్యి మాటలు చెప్పగలదు” అన్న మాటకు ఈ చిత్రం చక్కటి నిదర్శనంగా నిలుస్తోంది. ఫోటోగ్రఫీ అంటే కేవలం కెమెరాతో దృశ్యాన్ని బంధించడం మాత్రమే కాకుండా ఒక క్షణంలోని అందాన్ని, భావాన్ని, అనుభూతిని శాశ్వతంగా నిలిపే కళ అని ఈ చిత్రం మరోసారి గుర్తుచేస్తోంది.



## విద్యుదాఘాతంతో రైతు మృతి

**గద్వాల జిల్లా ప్రతినిధి,ఆగస్టు18(ప్రభాత ఉదయం)**

మల్దకల్ మండలం కేంద్రంలో విద్యుదాఘాతంతో రైతు మృతి చెందాడు. గ్రామానికి చెందిన కుమ్మరి తిమ్మప్ప (36) అనే రైతు మంగళవారం మధ్యాహ్నం వ్యవసాయ పొలానికి నీరు పెట్టేందుకు వెళ్లగా విద్యుత్ మోటార్ ఆన్ చేసే క్రమంలో ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మృతునికి భార్యతో పాటు ఒక కుమారుడు,ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. జరిగిన సంఘటనపై కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గద్వాల జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు ఎస్సై శ్రీహరి తెలిపారు.





## ఘనంగా మహారాణి ఆదిలక్ష్మి దేవమ్మ వర్ధంతి

**గద్వాల జిల్లా ప్రతినిధి,ఆగస్టు 18(ప్రభాత ఉదయం)**

గద్వాలలోని మహారాణి ఆదిలక్ష్మి దేవమ్మ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య షేక్ కలందర్ భాషా అధ్యక్షతన “మహారాణి ఆదిలక్ష్మి దేవమ్మ “వర్ధంతి ని పురస్కరించుకుని ఆమె విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు . ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ మాట్లాడుతూ, ఆదిలక్ష్మి దేవమ్మ గద్వాల ప్రాంత అభివృద్ధికి, ప్రజా సంక్షేమానికి అందించిన సేవలు చిరస్మరణీయమని అన్నారు. ఆమె సేవలు నేటి తరానికి స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు.ఆదిలక్ష్మి దేవమ్మ ఆశయాలను విద్యార్థులు ఆదర్శంగా తీసుకొని సమాజాభివృద్ధిలో భాగస్వాములు కావాలని ప్రిన్సిపాల్ పిలుపునిచ్చారు. ఆమె సేవలను స్మరించుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు.ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కే చంద్రమోహన్, ఐ క్యు ఏసి కోఆర్డినేటర్ ఏ రాధిక, సీనియర్ అద్యాపకులు శ్రీ సురేందర్ రెడ్డి, డాక్టర్ కే సత్యన్న , డాక్టర్ వెంకటేశ్వరమ్మ, ఏం హెచ్ నాగభూషణం, జిటి పద్మ, కే భాస్కర్, తదితర అధ్యాపకులు కళాశాల సూపర్టెండెంట్ జి రమేష్ , బోధనేతర సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.




## జీవో 97ను రద్దు చేయాలి

గద్వాల జిల్లా ప్రతినిధి,ఆగస్టు 18(ప్రభాత ఉదయం)రాష్ట్రంలో పాలిటెక్నిక్ విద్యా వ్యవస్థను నిర్వీర్యం చేసే జీవో--97ను రద్దు చేయాలని కోరుతూ మంగళవారం గద్వాల జిల్లా కలెక్టరేట్ ముందు ఏబీవీపీ నాయకులు, గద్వాల పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు ఆందోళన కార్యక్రమాలు చేపట్టారు. ఇందులో భాగంగా జిల్లా కలెక్టరేట్ ముందు బైఠాయించి నిరసన చేపట్టారు. ఈమేరకు రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నరేష్ పటేల్ మాట్లాడుతూ.. పేద విద్యార్థులకు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలల్లో అందిస్తున్న సాంకేతిక విద్యను ప్రయివేట్ సంస్థల్లో విలీనం చేయడం సరికాదని, ఇంజనీర్ కావాలనే వారి కలల్ని దూరం చేసి భవిష్యత్తును అంధకారంలోకి నెట్టే ప్రయత్నం కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. పాలిటెక్నిక్ కళాశాలలను యథావిధిగా కొనసాగించాలని లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు నిర్వహించి, ముఖ్యమంత్రి నివాసాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. . అనంతరం జిల్లా అదనపు కలెక్టర్ మధుమోహన్ కు ఏబివిపి నాయకులు, విద్యార్థులు, వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏబివిపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నితిన్ , ఎస్ఎఫ్ఎస్ కో కన్వీనర్ నరేంద్ర, సోషల్ మీడియా ఇంచార్జ్ సురేష్ నాయుడు, ఎంఏఎల్‌డి కళాశాల ఏబివిపి అధ్యక్షులు తేజ , ఎస్విఎం కళాశాల అధ్యక్షులు మంజునాథ్ నగర, కార్యాలయం కార్యదర్శి సాయి హర్ష, ఉదయ్, మురళి, ప్రణీత్, రోహిత్, భార్గవ్, నవ్య, శ్రావణి, అనుశ్రీ, శ్రీలత, పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

# పాపన్న గౌడ్ పోరాట స్ఫూర్తిని యువత ఆదర్శంగా తీసుకోవాలి

**సర్వాయి పాపన్న గౌడ్ ఆశయాలు నేటి తరానికి స్ఫూర్తిదాయకం..**

**ఘనంగా సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతి వేడుకలు.**

**గద్వాల జిల్లా ప్రతినిధి, ఆగస్టు 18 (ప్రభాత ఉదయం)**



గద్వాల పట్టణంలో సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతి సందర్భంగా గౌడ నాయకులు,మరియు బిజెపి జిల్లా పార్టీ ఆద్వర్యంలో క్రిష్ణ వేణి చౌక్ దగ్గర ఉన్న ఆయన విగ్రహానికి పూల మాల వేసి నివాళులర్పించిన నాయకులు... ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు రామాంజనేయులు మాట్లాడుతూ..బడుగు, బలహీన వర్గాల హక్కుల కోసం పోరాడిన సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ ధైర్యసాహసాలు, సామాజిక సమానత్వం కోసం ఆయన చేసిన పోరాటం నేటి తరానికి స్ఫూర్తిదాయకమని అన్నారు. సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ ఆశయాలను ముందుకు తీసుకెళ్లేందుకు యువత ఐక్యంగా కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఆయన చూపిన ధైర్యం, సమాజం కోసం చేసిన పోరాటాన్ని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని అన్నారు.గౌడ నాయకులు తులసిగౌడు, సందీప్ గౌడు,మధుగౌడు, పవన్ కుమార్ గౌడు, జమ్మిచేడు రామచంద్ర గౌడు, మల్దకల్ వి ఎల్ కుమార్ గౌడు, ఉప్పేరు రఘుగౌడ్ ,ఈ కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ బండల వెంకట రాములు, జిల్లా ప్రధాన కార్యదర్శి రవి కుమార్ ఎక్బోటే, మాజీ బిజెవైఎం జిల్లా అధ్యక్షుడు మిర్జాపురం వెంకటేస్వర రెడ్డి, ఓబీసీ మోర్చా అధ్యక్షుడు దాస్, కౌన్సిలర్లు శాలన్న, చంద్రశేఖర్, రాష్ట్ర ఓబీసీ మోర్చాకార్యవర్గ సభ్యులు అనిల్ బిజెపి సీనియర్ నాయకులుమాజీ కౌన్సిలర్ నల్లారెడ్డి,శ్రీమన్నారాయణ,శంకర్,బిజెవైఎం నాయకులు పాండు ,మోహన్ రెడ్డి,సతీష్,రమేష్, పవన్ ,బజరంగ్ భాస్కర్,మహిల మోర్చా భారతి తదితరులు హాజరయ్యారు..



## తెలంగాణ బహుజన ఆత్మగౌరవ ప్రతీక సర్వాయి పాపన్న గౌడ్ :

**గద్వాల జిల్లా ప్రతినిధి,ఆగస్టు 18(ప్రభాత ఉదయం)**

తెలంగాణ బహుజన ఆత్మగౌరవానికి, ధీరత్వానికి సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ ప్రతీకగా నిలిచారని స్వేరోస్ నెట్ వర్క్ టౌన్ అధ్యక్ష,కార్యదర్శులు కే.తరుణ్, ఎండి నవీద్ అన్నారు. సర్వాయి పాపన్న జయంతి సందర్భంగా మంగళవారం గద్వాలలోని ఆయన విగ్రహానికి స్వేరోష్ నాయకులు పూలమాల వేసి నివాళులర్పించారు.సబ్బండ వర్గాలకు రాజకీయ,సామాజిక సమానత్వం కోసం పాపన్న చేసిన కృషి చరిత్రలో సువర్ణాక్షరాలతో ఎప్పటికీ నిలిచి ఉంటుంది అని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో సభ్యులు అజయ్,,రహమత్, రఫీ, విజయ్ కుమార్ గౌడ్, వసంత్ వరదరాజు, ఓంకార్, రాము, ఇమ్మనియెల్, రాజు తదితరులు పాల్గొన్నారు.

Printed and Published **MEKALA DAMODAR REDDY** on behalf of DBC Publications, and Printed at Vanitha Graphics, H.No. 3-3-76/123/21, Maruthi Enclave, Attapur, Rajendra Nagar, Ranga Reddy, Telangana-500048. and Published at: H.No. 6-2-4/2, 1st Floor, Shivarampally , NPA, Rajendra Nagar, Ranga Reddy Telangana-500052. **Editor: MEKALA DAMODAR REDDY. “RNI. Title- Code: TELTEL12231**. Cell:9391089608